

హైదరాబాద్ వార్త

# అర్ధనారీశ్వరతత్త్వానికి నిలువుటద్దం ఏకత్వం



**రవీంద్రభారతి, జూన్ 24 ప్రభాతవార్త :** రాష్ట్ర సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో 3రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న జాతీయ నృత్యోత్సవంలో 3వరోజు బుధవారం రాత్రి ముగింపు వేడుకల్లో యావత్ సృష్టికి ఆదర్శ స్ఫూర్తిదాయకం శివపార్వతుల సాంగత్యం, విడదీయలేని బంధమంటూ బెంగళూరు కళాకారుల ద్వయం కరుణాద్, రచనా కరణిక్‌లు ప్రదర్శించిన ఏకత్వం అర్ధనారీశ్వర తత్త్వానికి నిలువుటద్దంగా నిలిచింది. లక్నో ఘరానా కథక్ నృత్యశైలిలో శృతిలయ విన్యాసాలతో ఆకట్టుకుంది. కథక్, భరతనాట్యం, కూచిపూడి నృత్యశైలులతో ఎంతో ఉత్కృష్ట అర్ధనారీశ్వరతత్త్వాన్ని జాతీయస్థాయి కళాకారులు అద్భుతంగా ఆవిష్కరించి ప్రేక్షకుల హృదయాలను దోచుకున్నారు. జంట కళాకారులు నిధగా, రచన కథక్‌లోని తాల్ లయ సౌందర్యంతో కాశ్మిక్ రిథమ్ మొత్తం సృష్టికి కారణమని నొక్కివక్కాణించింది. పరమశివుడిలో అర్ధభాగమైన శక్తిస్వరూపిణి దైవత్వాన్ని లాలిత్యాన్ని ధీరత్వాన్ని ప్రదర్శించగా మహాదేవుడి అనేక కోణాలను ఆవిష్కరిస్తూ శంకర గిరిజాపతే అంశాన్ని రసరమ్యంగా ప్రదర్శించారు. భరతనాట్య కళాకారుడు సూర్య ఎన్.రావు రామాయణంలోని ప్రతినాయకుడు రావణాసుర ప్రదర్శించి ప్రశంసలందుకున్నారు. ఆఖరిగా న్యూఢిల్లీకి చెందిన పద్మవిభూషణ్ రాజారాధా కౌశల్యారెడ్డి వాసరద్వయంలో యామినిరెడ్డి తన నాట్యతరంగిణి బృందంతో కూచిపూడి నృత్యాంశాలు నృత్యోత్సవానికే తలమానికంగా నిలిచాయి. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ ఉపాధ్యక్షురాలు ఆచార్య అనూరాధ జొన్నలగడ్డ, పద్మశ్రీ దీపికారెడ్డి, ఉమామహేశ్వరి, జైళ్ల నిర్వహణ డీజి సౌమ్యమిశ్రా, డా. కళాకృష్ణ, డా. వనశ్రీరావు, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, ఎ.కె.ఖాన్ తదితర ప్రముఖులు పాల్గొని సత్కరించారు.



# 'సర్‌కు' సర్వం సిద్ధం..

- నేటి నుంచి జూలై 24వరకు ఇంటింటికి బిఎల్‌వోలు
- ఓటర్ జాబితాలో పేరు ఉన్నవారికి ఎన్యూమరేటర్ ఫారాలు
- రెండు ఓట్లు ఉంటే ఒకటి కట్..లేనివారికి కొత్తగా ఓటుహక్కు
- కుటుంబ సభ్యుల వివరాలు సైతం సవరణ చేసుకునే అవకాశం
- ఫాం తప్పుగా నింపినా..బిఎల్‌వోలకు ఇవ్వకపోయినా నోటీసులు
- జూలై 31నాటికి జాబితా..సెప్టెంబర్ 20వరకు అభ్యంతరాలు
- అక్టోబర్ 1 ఓటర్ల తుది జాబితా ప్రకటన

**హైదరాబాద్, జూన్ 24,ప్రభాతవార్త:** ఎన్నికలు వచ్చాయంటే ఓటరు దేవోభవ అంటూ రాజకీయ నేతలు పరుగులు తీస్తారు. సామాన్యుడి నిర్ణయాలతో రాజకీయాలు, దేశ భవిష్యత్‌లోనూ మార్పులు వస్తాయి. ఓటుకు రాజకీయ నేతల భవిష్యత్ చూపుడు వేలుకు పెట్టే సిరా చుక్కతో తారుమారవుతుంది. ఓటర్లే నిర్ణేతలుగా ఉంటారు. మనిషికి ఒక వజ్రాయుధంగా రాజ్యాంగం ప్రతి ఒక్కరికి కల్పించిన హ ఓటు హక్కు. అది పొందడానికి ఎన్నికల కమిషన్ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తోంది. ఈక్రమంలోనే ప్రజాస్వామ్య బలోపేతానికి స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపకల్పన అవసరం. ఈనేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ జాబితా ప్రక్షాళనకు పూనుకుంది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ప్రక్రియ ప్రవేశపెట్టి జూన్ 25 నుంచి జూలై 24 వరకు క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే నిర్వహిస్తుంది. అలాగే జులై 24 నాటికి పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, జూలై 31న ఓటర్ జాబితా ముసాయిదా వెల్లడిస్తారు. అదే రోజు నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదులను స్వీకరిస్తారు. జూలై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాలు, ఫిర్యాదులను పరిష్కరిస్తారు. తుది ఓటర్ జాబితాను అక్టోబర్ 1వ తేదిన వెల్లడిస్తారు. ఓటర్ జాబితాలో చనిపోయిన వారు, డూప్లికేట్, శాశ్వతంగా వలసపోయిన వారు, అనర్హుల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగిస్తారు. బీఎల్‌వోలు ప్రతి ఇంటిని సందర్శించి ఇప్పటికే ఓటరు జాబితాలో ఉన్నవారికి ఎన్యుమరేషన్ ఫారాలను అందజేస్తారు. ఓటర్లు తమ పేరు, వయసు, కుటుంబ సభ్యుల వివరాలు, చిరునామా వంటి సమాచారాన్ని పరిశీలించి అవసరమైతే సవరణలు సూచించవచ్చు. ఇంటివద్ద ఎవరూ లేకపోతే బీఎల్‌వోలు కనీసం మూడుసార్లు ఆ ఇంటిని సందర్శించి వివరాలు సేకరింస్తారు. బీఎల్వోలకు రాజకీయ పార్టీలు నియమించుకునే బూత్ స్థాయి సహాయకులు సహకరిస్తారు. బీఎల్‌వోలు వచ్చినప్పుడు ఓటరు అందుబాటులో లేకపోతే ముసాయిదా జాబితాలో ఆ ఓటరు పేరుపక్కన మార్క్ చేస్తారు.

**ప్రజలేం చేయాలి..?**

సర్ ప్రక్రియ సమయంలో బీఎల్ వోలు అందజేసే ఎన్యుమరేషన్ ఫారాల్లో ప్రతి ఓటరు తమ వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలి. తప్పులుంటే సవరణ కోరవచ్చు. 2002లో ఒక నియోజకవర్గంలో ఉండి ప్రస్తుతం మరో నియోజకవర్గంలో నివసిస్తూ అక్కడే ఓటు ఉంటే సాఫ్ట్‌వేర్ దాన్ని గుర్తిస్తుంది. ఓటరు ప్రస్తుతం ఉన్న ఫారంను నింపినప్పుడు 2002 నాటి డేటాబేస్‌లోవారి పేరు, తండ్రి/భర్త పేరును వెతికి పాత రికార్డును కొత్త రికార్డుతో లింక్ (క్రాస్ కానిస్టిటెన్సీ) చేస్తుంది. దీనివల్ల పాతచోట ఓటు రద్దవుతుంది. 2002 రికార్డుల్లో మీ ఓటు దొరక్కపోయినా ప్రస్తుత నివాస ప్రాంతంలో మీరు స్థానికులేనని నిరూపించే ప్రత్యామ్నాయ పత్రాలను (ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు, రిజిస్టర్డ్ సేల్‌డీడ్, పాస్‌పోర్టు ) పరిశీలించి ప్రస్తుత ఓటును ఖరారు చేస్తారు. దీంతో కొత్తగా ఓటును నమోదు చేసుకోవచ్చు. వారి తండ్రి, తల్లికి సంబంధించిన 2002 ఓటరు ఐడీ రికార్డుతో పిల్లల ఓటును లింక్ చేస్తారు. ఓటరు పేరులో అక్షర దోషం లేదా ఇంటిపేరు మార్పు ఉంటే ఆధార్ కార్డు, పాన్ కార్డు, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, పదో తరగతి మార్కుల మెమో వంటివాటిని సమర్పించాలి. వయస్సు లేదా జన్మతేదీల్లో తేడా ఉంటే జనన ధ్రువీకరణ పత్రం, పదో తరగతి మెమో, ఆధార్ కార్డు పత్రాల్లో ఏదో ఒకటి ఇవ్వాలి. తల్లిదండ్రుల పేర్లు, బంధుత్వాల్లో తేడాలుంటే కుటుంబ రేషన్ కార్డు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, ఓటరు గుర్తింపు కార్డులు, పాఠశాల రికార్డులను సమర్పించాలి. అయితే ఓటరు తమ వివరాలను సమర్పించటంతో పాటు 2002లో జరిగిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో తన ఓటు ఎక్కడ ఉంది? పోలింగ్ స్టేషన్ నెంబర్, ఓటరు లిస్టులో ఓటు వరుస సంఖ్య వంటి వివరాలను పొందుపరిచి, డిక్లరేషన్ కూడా ఇస్తూ సంతకం చేయాల్సి ఉంటుంది. ఒక వేళ 2002లోని సర్ ప్రక్రియలో తన ఓటు లేని పక్షంలో ఓటర్లు ఆ సర్‌లో ఉన్న ప్రస్తుత ఓటరు కుటుంబ సభ్యుల్లో ఎవరి వివరాలనైనా సమర్పించవచ్చునని కూడా అధికారులు సూచించారు.ఓటరు రెండు చోట్ల వివరాలు నమోదు చేసి ఉంటే ప్రజాప్రతినిధుల చట్టం 1950 సెక్షన్ ప్రకారం నేరంగా పరిగణించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నేరానికి రూ.5 వేల జరిమానా గానీ ఏడాది జైలు శిక్ష గానీ విధించవచ్చునని, అవసరమైతే జరిమానాతో పాటు జైలు శిక్ష కూడా విధించే అవకాశాలున్నట్లు వెల్లడించారు.

**15 నియోజకవర్గాలు..4062మంది బిఎల్‌వోలు..**

నగరంలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 4062 పోలింగ్ స్టేషన్లకు ఒక్కో స్టేషన్ కు ఒక్కో బూత్ లెవెల్ ఆఫీసర్లను నియమించారు. మొత్తం 4062 బూత్ లెవెల్ ఆఫీసర్లను నియమించారు. ప్రతి పది మంది బూత్ లెవెల్ ఆఫీసర్లకు ఒక సూపర్ వైజర్ ను నియమించారు. బూత్ లెవెల్ ఆఫీసర్లతో పాటు వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులను పోలింగ్ బూత్ ఏజెంట్లుగా నియమించి, సర్ ప్రక్రియను నిర్వహించాల్సిన తీరుపై వారికి శిక్షణ ఇచ్చారు. ఈ రకంగా అన్ని పార్టీలకు చెందిన సుమారు 10 వేల 901 మంది బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించారు.

# జగదాంబికకు తొలి బంగారు బోనం

- ఆషాఢ బోనాల జాతర 2026 ఏర్పాట్లపై అధికారుల సమీక్ష
- పాల్గొన్న మంత్రులు, అధికారులు, దేవాలయాల కమిటీలు




సమావేశంలో మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్, చిత్రంలో అజారుద్దీన్, అనీల్‌కుమార్‌యాదవ్ ఎమ్మెల్యేలు, డీజీపీ, ఇతర అధికారులు.

**జూబ్లీహిల్స్, జూన్ 24, ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి వైభవానికి ప్రతీకమైన బోనాల జాతర-2026 నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో అధికారులతో, ఉమ్మడి దేవాలయాల కమిటీ సభ్యులతో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, సహచర మంత్రి మహ్మద్ అజారుద్దీన్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ జూమ్ ద్వారా సమావేశంలో పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. సమీక్షా సమావేశంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే దానం నాగేందర్, ప్రభుత్వ సలహాదారు గోవర్ధన్ రెడ్డి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, డీజీపీ సీవీ ఆనంద్, మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, పోలీస్ కమిషనర్లు, జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, ఉమ్మడి దేవాలయాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు జూలై 15న ప్రారంభమై ఆగస్టు 13న ముగుస్తాయన్నారు. జూలై 19న గోల్కొండ జగదాంబిక అమ్మవారి ఆలయంలో బంగారు బోనం సమర్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. జూలై 26న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఆలయం, అగస్టు 2న లష్కర్ బోనాలు, అగస్టు 9న పాతబస్తీ లాల్ దర్వాజ బోనాలు, 10న రంగం(పోతరాజు బోనాలు) ఉంటాయన్నారు. వీటితోపాటు సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో బోనాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆగస్టు 2న లాల్‌దర్వాజ మహంకాళి బోనాలు, ఆగస్టు 3న సంప్రదాయ రంగం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. బోనాల ఉత్సవాల సందర్భంగా దేవాలయాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. అలాగే 28 ప్రముఖ దేవాలయాల్లో ప్రభుత్వం తరఫున మంత్రులు పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. మూడు ప్రధాన దేవాలయాల్లో ఏనుగు ఊరేగింపులు, ఘంటానాదాలతో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం ఏర్పడకుండా భద్రత, ట్రాఫిక్, పారిశుద్యం, తాగునీరు, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి బోనాల ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాల్లో పాల్గొనాలని వారు కోరారు. ఈ సందర్భంగా పలు ఆలయ కమిటీలు తమకు ఎదురయ్యేటువంటి సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఆలయాల వద్ద విద్యుత్‌దీపాల ఏర్పాటు, పారిశుద్యం విషయంలో ఖచ్చితంగా శ్రద్ధ పాటించాలని సూచించారు.

## వేయి కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా



హైడ్రా ఫెన్సింగ్ వేసిన దృశ్యం

**హైదరాబాద్, జూన్ 24, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్‌లోని 5ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. సర్వే నంబరు 42లో మెటల్ చార్మినార్ నుంచి హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌కు వెళ్లే మార్గంలో అత్యంత విలువైన భూమిని కాజేయాలని కొంతమంది ప్రయత్నించారు. అక్కడ రెండు తాత్కాలిక షెడ్డులు వేసి ఒక గదిని కూడా నిర్మించారు. 5 ఎకరాల చుట్టూ రేకుల షీట్లతో ప్రహరీ కూడా నిర్మించే క్రమంలో హైడ్రాకు రెవెన్యూ శాఖ నుంచి ఫిర్యాదు అందింది. ఎన్నో ఏళ్లుగా ఈ భూమి తనదిగా చెబుతూ ఎవరినీ అటువైపు రానీయకుండా అడ్డుకుంటున్న పరిస్థితుల్లో శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారుల విజ్ఞప్తి మేరకు హైడ్రా రంగంలోకి దిగింది. రెండు తాత్కాలిక షెడ్డులతో పాటు.. నిర్మించిన గదితో పాటు ఫెన్సింగ్‌ను హైడ్రా తొలగించింది. మొత్తం ఆక్రమణలు తొలగించిన తర్వాత 5 ఎకరాల ప్రభుత్వ భూ మి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. అలాగే ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. ఈ భూమి విలువ దాదాపు రూ. వెయ్యికోట్ల వరకూ ఉంటుందని అంచనా.

**మద్రిపల్లి చెరువు కబ్జాలు తొలగింపు...**

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మద్రిపల్లి విలేజ్‌లోని మద్రిపల్లి చెరువులో కబ్జాలను హైడ్రా తొలగించింది. చెరువు పైభాగంలో తన పట్టాల్యాండ్‌లోని ఆర్‌ఎంసీ యూనిట్ పెట్టి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టిని నింపుతూ కబ్జాలకు పాల్పడ్డాడు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోనే కార్మికులు నివాసం ఉండేందుకు షెడ్డులు కూడా నిర్మించాడు. ఇలా 5 ఎకరాల మేర మట్టితో నింపి కబ్జా చేయడానికి ప్రయత్నించగా...ప్రజావాణి ఫిర్యదుతో హైడ్రా క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో విచారణ చేపట్టింది. కబ్జాలను నిర్ధారించుకుని షెడ్డులను హైడ్రా మంగళవారం తొలగించింది. ఎఫ్‌టీఎల్ హద్దులను నిర్ధారిస్తూ హైడ్రా ఫెన్సింగ్ వేసింది. పొలం పనులకు అవకాశం కల్పిస్తూ దారి చూపింది. చెరువులో వేసిన మట్టిని తొలగించాలని హైడ్రా ఆదేశించింది.మద్రిపల్లి చెరువు మొత్తం 31.05 ఎకరాల మేర విస్తరించి ఉన్నట్టు హెచ్ ఎండీఏ లెక్కలు చెబుతున్నాయి. ఆ మేరకు చెరువును పరిరక్షి ంచేలా చర్యలు హైడ్రా తీసుకుంది.

## మొహర్రం సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేయాలి



బీబీకా ఆలవాను సందర్శించిన తొమ్మిదవ నవాబ్ హైదరాబాద్ ఆసఫ్ జాహి రౌనాఖ్ యార్ ఖాన్,బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

**చార్మినార్,జూన్ 24 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ డబీర్‌పురలో ఉన్న చారిత్రాత్మక బీబీ కా అలవాను బుధవారం తొమ్మిదవ నవాబ్ హైదరాబాద్ ఆసఫ్ జాహి రౌనాఖ్ యార్ ఖాన్,,రాష్ట్ర బిజెపి మాజీ మైనార్టీ మోర్చ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీతో పాటు పలువురు సందర్శించి దట్టీలు సమర్పించారు.ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర మాజీ మైనార్టీ మోర్చ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ మాట్లాడుతూ మొహర్రం సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండ సంబంధిత అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు.కార్యక్రమంలో హాకీం తయ్యాబి,సీనియర్ నాయకులు అల్కా మనోజ్ పాల్గొన్నారు.

## రుణం పేరుతో రూ.23.22 లక్షల మోసం.. -నలుగురు అరెస్ట్

**సంజీవరెడ్డి నగర్, జూన్ 24, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో రుణం ఇప్పిస్తామని నమ్మించి ఓ వ్యక్తి నుంచి రూ.23.22 లక్షలు కాజేసిన కేసులో నలుగురిని పోలీసులు అరెస్ట్ చేయగా, మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. ఈ విషయాన్ని ఎస్ఆర్ నగర్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, ఎస్ఆర్ నగర్‌కు చెందిన చిట్టిమోతు భవానీ శంకర్ ఆర్థిక ఇబ్బందుల కారణంగా బండ్లగూడ, పటాన్‌చెరువులో ఉన్న తన ఇంటిని తనఖా పెట్టి రుణం తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో పరిచయస్తుడు ఇసాముద్దీన్ ద్వారా కాసర్ల కుమారస్వామి, సిల్వేరు వెంకటేష్‌లను సంప్రదించారు. నిందితులు రుణం ఇప్పిస్తామని నమ్మించి ఇంటి పత్రాలు తీసుకుని, 2024 నవంబర్ 29న యూనిటీ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ నుంచి రూ.44 లక్షల ఎంఎస్ఎంఈ రుణం మంజూరు చేయించారు.రుణ ప్రక్రియలో భాగంగా భద్రత కోసం అవసరమని చెప్పి బాధితుడి నుంచి ఎస్‌బీఐకి చెందిన 18 సంతకం చేసిన ఖాళీ చెక్కులు తీసుకున్నారు. అనంతరం ఆ చెక్కుల్లో నాలుగు చెక్కులను బాధితుడి అనుమతి లేకుండా నింపి నగదుగా మార్చి రూ.23,22,549 అక్రమంగా ఉపసంహరించుకున్నట్లు పోలీసులు గుర్తించారు.ఈ వ్యవహారంలో కాసర్ల కుమారస్వామి, సిల్వేరు వెంకటేష్, కాసర్ల కావ్య, గొట్టం శోభారాణి, వుల్లి యాదగిరి కలిసి కుట్ర పన్ని మోసానికి పాల్పడినట్లు తేలింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్రధాన నిందితులైన కాసర్ల కుమారస్వామి, సిల్వేరు వెంకటేష్, కాసర్ల కావ్య, గొట్టం శోభారాణిలను జూన్ 23న అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి జ్యుడీషియల్ రిమాండ్ విధించారు.మరో నిందితుడు వుల్లి యాదగిరి పరారీలో ఉండగా, అతని కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు తెలిపారు. మోసం, నమ్మకద్రోహం, ఫోర్జరీ తదితర నేరాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ఆస్తికోసం తండ్రిపై కొడుకు దాడి..

**అత్తాపూర్ జూన్ 24,ప్రభాతార్త :** ఆస్తికోసం కన్న తండ్రి పై కొడుకు దాడి చేసిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పర్పల్లి గ్రామంలో అనంతరెడ్డి అనే వ్యక్తికి 31 గుంటల స్థలం ఉంది. ఈయనకు రవికాంత్ రెడ్డి, ఓం రెడ్డి అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా ఇటీవల ఆయన స్థలంలో కొంత భాగాన్ని రవికాంత్ రెడ్డి, ఓం రెడ్డిలకు సమానంగా పంచి ఇచ్చారు. మరో మూడు గుంటల స్థలాన్ని అనంతరెడ్డి తన పేరు మీదనే ఉంచుకున్నారు. ఇదిలా ఉంటే ఆయన చిన్న కుమారుడు ఓం రెడ్డి ఆ మూడు గంటల స్థలాన్ని కూడా తన పేరు పైన రాసి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గొడవకు దిగారు. ఈ క్రమంలో తండ్రి అనంతరెడ్డి పై దాడి చేయడంతో పాటు అడ్డు వచ్చిన వారిపై కూడా దాడి చేసినట్లు తెలిపారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# వర్షం పడినా ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు

### నాలాలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి
### ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి



బేగంపేట పరిసర ప్రాంతాలలో అధికారులతో పాటు పర్యటిస్తున్న ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి

**హైదరాబాద్, జూన్ 24 ప్రభాతవార్త:** క్రమం తప్పకుండా వరద నీటి కాలువలను డీసిల్టింగ్ చేయాలని మల్కాజ్‌గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి అధికారులను ఆదేశించారు. వర్షాకాల సన్నద్ధతలో భాగంగా బుదవారం సికింద్రాబాద్‌లోని రెజిమెంటల్ బజార్, బేగంపేటలోని ప్రకాశ్ నగర్, మయూర్ మార్గ్, సర్దార్ పటేల్ రోడ్ ప్రాంతాల్లో అధికారులు సిబ్బందితో కలిసి పర్యటించారు. రెజిమెంటల్ బజార్‌లో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న కొత్త నాలా అనుసంధాన పనులను కమిషనర్ పరిశీలించారు. భారీ వర్షాల సమయంలో వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా ప్రస్తుత డ్రైనేజీ వ్యవస్థకు కొత్త నాలాను అనుసంధానం చేస్తున్న పనుల పురోగతిని సమీక్షించారు. వర్షాకాలంలో నీరు నిల్వ లేకుండా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నాలా కనెక్టివిటీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే క్యాచ్ పిట్లు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్లు, మొత్తం డ్రైనేజీ వ్యవస్థ పనితీరును పరిశీలించి, నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బేగంపేట్ ప్రకాశ్ నగర్‌లో హుస్సేన్ సాగర్ వైపు వెళ్లే నాలా కనెక్టివిటీ, డ్రైనేజీ వ్యవస్థను కమిషనర్ పరిశీలించారు. నాలాలో పెరిగిన చెట్లు, పేరుకుపోయిన చెత్త, సిల్ట్ కారణంగా నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతున్నట్లు గుర్తించారు. నియమితంగా డీసిల్టింగ్ చేపట్టడం, చెట్లు, చెత్త తొలగించడం, వర్షపు నీరు నిరాటంకంగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ట్యాంక్ బండ్‌కు అనుకుని ఉన్న మార్గంలో అక్రమంగా చెత్త వేస్తున్న విషయాన్ని గుర్తించి, వెంటనే తొలగించడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మయూర్ మార్గ్‌లో నాలా కనెక్టివిటీని పరిశీలించిన కమిషనర్, ఈ ప్రాంతం లోతట్టు ప్రాంతం కావడంతో భారీ వర్షాల సమయంలో ఓపెన్ నాలా నుంచి నీరు తిరిగి కాలనీ డ్రైనేజీ వ్యవస్థలోకి చేరి, నీరు నిలిచే పరిస్థితి ఏర్పడుతున్నట్లు గుర్తించారు. నాలాలు, స్టార్మ్ వాటర్ డ్రెయిన్లను క్రమం తప్పకుండా డీసిల్టింగ్ చేయడం, ఎలాంటి అడ్డంకులు లేకుండా నిర్వహించడం ద్వారా వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి డ్రైనేజీ, పారిశుధ్య సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. బేగంపేట్ సర్దార్ పటేల్ రోడ్డులో స్టార్మ్ వాటర్ డ్రెయిన్ నెట్‌వర్క్, డ్రైనేజీ కనెక్టివిటీని కమిషనర్ పరిశీలించారు. భారీ వర్షాల సమయంలో నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా స్టార్మ్ వాటర్ డ్రెయిన్లను క్రమం తప్పకుండా డీసిల్టింగ్ చేయాలని, అడ్డంకులను తొలగించాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని ప్రధాన రహదారులలో ఒకటైన సర్దార్ పటేల్ రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉండి ట్రాఫిక్‌కు అంతరాయం కలగ కుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీ, డీఈ, ఏఈలు, హైడ్రా, టౌన్ ప్లానింగ్, రామ్‌కీ, ఈపీటీఆర్ఐ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన టిటిడి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

**ప్రత్యేకంగా పూజలు నిర్వహించిన నగర సిపి సజ్జనార్**



శ్రీవారికి చక్రస్నానం నిర్వహిస్తున్న పూజారులు

**సైఫాబాద్, జూన్ 23 ప్రభాతవార్త:** హిమాయత్ నగరంలోని టిటిడి బాలాజీ భవన్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాయలం 21 వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం సాయంత్రం ఘనంగా ముగిశాయి. ఈ నెల 20వ తేదీన బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన విషయం భక్తులకు, పాఠకులకు విధితమే. రోజువారి పూజా కార్యక్రమాల్లో భాగంగా స్వామివారికి సుప్రభాతం, సర్వ దర్శనం, సహస్రదీపాలంకరణ, ఏకాంత సేవ తదితర కార్యక్రమాలు యధావిధిగా కొనసాగాయి. అలాగే స్వామివారికి చక్రస్నానం కొనసాగగా, సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారికి అంగరంగ వైభవంగా కన్నుల పండువగా పుష్పయాగం కార్యక్రమం జరిగింది. పుష్పయాగం కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీవారికి రకరకాల పుష్పాలను భక్తి శ్రద్ధలతో సమర్పించుకున్నారు. భక్తుల గోవింద నామాలతో దేవాలయం దద్దరిల్లింది. అనంతరం ధ్వజా అనరోహనం కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఉదయం శ్రీస్వామివారిని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్, దేవాలయం లోకల్ అడ్వైయిజరీ కమిటీ అధ్యక్షుడు ఎన్.శంకర్‌గౌడ్, టిటిడి ఎఈవో యు.రమేష్, ఇన్స్పెక్టర్ శ్రీనివాస మణికంఠ, లక్ష్మీపతి తదితరులు ఘనంగా పూజలు నిర్వహించారు. బాలాజీ భవన్ భక్తుల సొసైటి ప్రతినిధు లు వేణు మనోహార్, శ్రీనివాస్ (వాసు గ్రూప్), ఉద్యోగులు, సిబ్బంది, శ్రీవారి సేవకులు భక్తులకు విశేషమైన సేవలు అందించారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు ఉదయం అల్పహారం, మధ్యాహ్నం, రాత్రికి అన్నప్రసాద వితరణ జరిగింది.

## ఎమ్మెల్సీ విజయశాంతికి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు



ఎమ్మెల్సీ విజయశాంతికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ సీనియర్ నేత జుర్కి రాజేందర్ కుమార్

**చాంద్రాయణగుట్ట, జూన్ 24, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ, సినీనటి విజయశాంతి జన్మదినాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, కేశవగిరి శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి దేవస్థానం పాలక మండలి మాజీ చైర్మన్ జుర్కి రాజేందర్ కుమార్ బుధవారం ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. పుష్పగుచ్ఛం అందజేసి ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకొని, భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి, వాటికి వన్నె తేవాలని ఆకాంక్షించారు. పాతబస్తీలో పర్యటించి ప్రజల సుఖఃదుఖాలను తెలుసుకోవాలని కోరారు. అందుకు ఆమె సానుకూలంగా స్పందించారు.

## లాల్‌దర్వాజా బోనాల ఏర్పాట్లకై మంత్రి పొన్నంకు వినతి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఆలయ చైర్మన్ అరవింద్ కుమార్ గౌడ్

**చాంద్రాయణగుట్ట, జూన్ 24, ప్రభాతవార్త :** తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన చారిత్రక లాల్‌దర్వాజా మహంకాళి బోనాల ఉత్సవాలకు ప్రభుత్వ పరంగా తగిన ఏర్పాట్లు చేయాలని కోరుతూ ఆ ఆలయ కమిటీ చైర్మన్ జి.అరవింద్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం బుధవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. జూలై 31వ తేదీ నుండి ప్రారంభం కానున్న లాల్‌దర్వాజా అమ్మవారి బోనాల ఉత్సవాల కోసం అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను సమన్వయం చేసి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లాల్‌దర్వాజా బోనాల ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు జి.కాశీనాథ్ గౌడ్, కె.వెంకటేష్, కోశాధికారి జి.హరీష్ గౌడ్, కమిటీ ప్రతినిధులు జె.రాజేష్ గౌడ్, ఎ.భరత్ కుమార్, సుధీర్ గౌడ్, రంగ హరినాథ్ గౌడ్, జి.మణికంటేష్ గౌడ్, సాగర్ ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు నర్సింహ గౌడ్, దుర్గేష్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## గెలిపిస్తే సంఘానికి మరింత సేవ చేస్తా : కృష్ణ



కేంద్ర సంఘం ఎన్నికల చైర్మన్ ఎ.రవీందర్‌కు అధ్యక్ష పదవికి నామినేషన్ పత్రాలను అందచేస్తున్న మిద్దెకృష్ణ

**గోషామహల్,జూన్ 24ప్రభాతవార్త:** తనపై నమ్మకం ఉంచి గెలిపిస్తే మరింత సేవా చేస్తాననిఅరుంధతీ సేవా మండలి కేంద్ర కమిటి అధ్యక్ష పదవికి పోటి చేస్తున్న అభ్యర్ధి మిద్దె కృష్ణ అన్నారు.వచ్చే నెల 5వ తేదిన జరిగే అధ్యక్ష ఎన్నికలకు మిద్దె కృష్ణ నామినేషన్ దాఖలు చేశారు.ఈసందర్బంగాఆయన మాట్లాడుతూ సంఘానికి కష్టపడి పని చేసే వారిని గుర్తించి గెలిపించాలన్నారు.తాను గతంలో అధ్యక్షులుగా కొనసాగి సంఘానికి సేవా చేసినట్లు చెప్పారు.మరోసారి అధ్యక్ష పదవికి బరిలో ఉన్నట్లు చెప్పారు.

## అక్షరాలు దిద్దించారు.. ఆనందాన్ని నింపారు



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

**జూబ్లీహిల్స్, జూన్ 24, ప్రభాతవార్తః**
జూబ్లీహిల్స్‌లోని భారతీయ విద్యాభవన్స్ పబ్లిక్ స్కూల్ ఆత్మకూరి రామారావు పాఠశాలలో బుధవారం నర్సరీ విద్యార్థులకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలతానాయర్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించారు. ఈ అక్షరాభ్యాస కార్యక్రమంలో చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వేద మంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్రమాలను నిర్వహించి చిన్నారులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల చిన్నారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లలతో అక్షరాలు దిద్దించి ఆనందాన్ని పంచుకున్నారు.

## ఇందిరానగర్‌లో ఎనిమిది నెలలుగా రహదారుల సమస్య



ఎంజీఆర్‌కు సమస్యలు తెలియజేస్తున్న బస్తీవాసులు

**జూబ్లీహిల్స్, జూన్ 24, ప్రభాతవార్తః**
ఖైరతాబాద్ నియోజకవర్గం జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్‌లో బుధవారం బీఆర్ఎస్ ఖైరతాబాద్ ఇంఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి సమస్యలపై సమరం కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. గత 8 నెలలుగా బస్తీలో రహదారి పనులు పూర్తి కాలేదని, దారులన్నీ కంకర తేలి నడవడానికి వీలు లేకుండా మారిందని స్థానికులు ఎంజీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. పలుమార్లు జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. జీహెచ్ఎంసీ ఎస్ఈ విజయ్‌కుమార్, ఏఈ వెంకటేష్‌లతో ఎంజీఆర్ వెంటనే ఫోన్‌లో మాట్లాడారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరిచేందుకు ప్రయత్నించాలని కోరారు. అలాగే స్థానికులు కొందరు నీటి సమస్యను ఎదుర్కొంటున్నట్లు ఆయన దృష్టికి తీసుకురాగా జలమండలి అధికారులతో మాట్లాడి ఆయా సమస్యను సైతం పరిష్కరించాలని సూచిచంఆరు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు శంకర్, బాబుగౌడ్, బాబు, చంద్రమౌళి, సత్తన్న, వెంకటేష్, శివకుమార్‌గౌడ్, నయీం తదితరులు పాల్గొన్నారు.

# దాడి చేసిన ప్రశాంత్ దాసును అరెస్ట్ చేయాలి : బాధితుడు



సమావేశంలో ప్రశాంత్‌దాస్‌పై నమోదైన క్రిమినల్ కేసులను సంబంధించిన ఎఫైర్ కాపీ ప్రదర్శిస్తున్న బాధితుడు

**అఫ్జల్‌గంజ్,జూన్ 24 ప్రభాతవార్త:** సాధు ముసుగులో దౌర్జన్యాలకు పాల్పడుతున్న వారి నుంచి రక్షణకల్పించాలంటూ దుర్గానగర్ ప్రాంతానికి చెందిన అజయ్‌సింగ్ పోలీసు ఉన్నత అధికారులను కోరారు.అఫ్జల్‌గంజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భాదితుడు అజయ్‌సింగ్ మాట్లాడుతూ పురానాపూల్ మూసినది పరివాహ ప్రాంతానికి ,నిర్వాన్ అకాడ మట్‌కి వెనకాల ఉన్న600 గజాల స్థలం తమ పూర్వీకుల నుంచి,గత 70 సంవత్సరాలుగా,తమ కుటుంబం జీవనోపాధి పొందుతుందన్నారు.తాను కూడా ఇదే స్థలంలో నివాసం ఉంటూ గణేష్ విగ్రహాలను తయారు చేస్తూ వాటిని విక్రయించి వచ్చే ఆదాయంతో జీవనోపాధి పొందుతున్నానని తెలిపారు.అయితే గత శనివారంనిర్వాహక ఆకాడ మట్‌కు చెందిన ప్రశాంత్‌దాస్,ఇతర రాష్ట్రాలకు చెందిన 15మంది నాగసాధులను,తానుఉంటున్న స్థలానికి మారణాయుధాలతో,వచ్చి తనపై దాడి చేసి విచక్షణ రహితంగా కొట్టి, తనని బలవంతంగా రోడ్డుపై ఈడ్చుకుంటూ,లాక్కొని వెళ్లి మఠంలో నిర్బంధించి,తనపై ఒంటిపై ఉన్న గుడ్డలనుకూడా తీసి తనపై పిడుగుద్దులతో, లాఠీలతో, విచక్షణ రహితంగా కొట్టారని రోదిస్తూ తెలిపారు.అయితే ఒకసారిగా తనని రోడ్డుపై లాక్కొని వెళ్తుండగా,స్థానికులు వీడియో తీసి100 ఫోన్ చేసి సమాచారం అందించడంతో వెంటనే కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్ రాములు,పోలీసులు సిబ్బంది హుటాహుటినా అకనకడి వచ్చి నిర్వాన్ అకాడ మఠ్‌లో నిర్బందించిన,తనను విడిపించినట్లు తెలిపారు. అజయ్ సింగ్‌పై ఎందుకుదాడి చేస్తున్నారని,నిర్బంధించారని తన అన్న కుమారుడు మోహిత్‌సింగ్ తలపై తల్వార్‌తో సాధువులుదాడి చేయడంతో,తీవ్ర గాయాలకు గురైన కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. 70ఏళ్లుగా ఈ స్థలంలో ఉంటున్న తాము ప్రభుత్వానికి ప్రాపర్టీటాక్స్ ,నల్లబిల్లు,విద్యుత్‌బిల్లు, అన్ని చెల్లిస్తున్నామన్నారు. స్థలం,మఠ్‌కు ఎలాంటి సంబంధంలేదని,ప్రశాంత్‌దాస్‌కు తెలిసినప్పటికి ఒక పథకంప్రకారం..బిహార్,యూపి నుంచి 15మంది సాధువులను రప్పించి తనపై దాడి చేసినట్లు చెప్పారు.అతనిపై కుల్సుంపురా పోలీసులు పలు సెక్షన్లు 329,(4), 109,324(4), 127.189, రెడ్‌విత్, 191(1)బిఎన్ఎస్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి మూడు రోజులవుతుందన్నారు.గత 9నెలలక్రితం ప్రశాంత్‌దాస్ గణేష్‌మండపంలో కూర్చున తనపై లాఠీతో దాడి చేయడంతో పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు చెప్పారు.సాధు ముసుగులో రౌడిలా,తనప్రాణాలు తీస్తే స్థలం తన సొంతం అవుతుందనిప్రశాంత్ దాస్ భావిస్తున్నట్లు తెలిపారు.ప్రశాంత్ దాస్ నుంచి ప్రాణ హాని ఉందని భాదితుడు అజయ్‌సింగ్ అన్నారు.

# ఎంఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం



స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డిలు

**హైదరాబాద్, జూన్ 24 ప్రభాతవార్త:**
మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సమావేశం మున్సిపల్ పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ అధ్యక్షతన కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో తార్నాకలోని ఎంఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నగరాభివృద్ధికి సంబంధించిన 13 కీలక అజెండా అంశాలపై సమగ్రంగా చర్చించారు. స్టాండింగ్ కమిటీ సమావేశం అనంతరం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ వేస్ట్ టు వండర్ ప్రాజెక్టు కోసం భూ గుర్తింపు, క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి, 141 నీట మునిగే ప్రాంతాల నిర్వహణ, లేక్ ఎకానమీ కార్యక్రమాలు, లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ పురోగతి, నిర్మాణ, కూల్చివేత వ్యర్థాల నిర్వహణ, క్యూర్1 అమలు, రెవెన్యూ వసూళ్ల పురోగతి, ప్రత్యేక డ్రైవ్‌ల అనంతర పారిశుద్ధ్య నిర్వహణ, అలాగే సోషల్ మీడియా ద్వారా పౌరులతో సమర్థవంతమైన అనుసంధానం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు మెరుగైన పట్టణ సేవలు అందించేందుకు ప్రతి అంశంపై కార్యాచరణ ప్రణాళికను వేగవంతం చేయాలని, 141 వాటర్‌లాగింగ్ ప్రాంతాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ, సమర్థవంతమైన పర్యవేక్షణ, శాఖల మధ్య సమన్వయంతో మల్కాజిగిరిని మరింత పరిశుభ్రమైన, సురక్షితమైన, సుస్థిరమైన నగరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు కట్టుబడి పనిచేయాలని సమావేశంలో ఆదేశించారు. ఈ సమావేశంలో జోనల్ కమిషనర్లు రాధికా గుప్తా, సంచిత్ గంగ్వార్, వికాస్ మహతో, అదనపు కమిషనర్లు రఘుప్రసాద్, వేణు గోపాల్, చీఫ్ ఇంజినీర్ అశోక్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, పీడీ యూసీడి సురేష్ కుమార్, వెటర్నరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సమాజహితం కోసం పనిచేసే నేతలకే గుర్తింపు : చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న సామ రామ్మోహన్‌రెడ్డి,సీనియర్ నాయకులు,కార్యకర్తలు

**సైబరాబాద్ ప్రతినిధి, జూన్24 ప్రభాతవార్త**
సమాజ హితం కోసం నిరంతరం ప్రజాబాహుళ్యంలో పనిచేసే నేతలకు గుర్తింపు ఉంటుందని టీపీసీసీ మీడియా అండ్ కమ్యూనికేషన్ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శేరిలింగంపల్లి నియోజక వర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. జగదీశ్వర్‌గౌడ్ జన్మదిన్నాన్ని పురస్కరించుకుని నల్లగండ్ల గ్రామంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో వారి తనయుడు వైభవ్ కృష్ణగౌడ్ ఏర్పాటు చేసిన వేడుకల్లో భాగంగా ప్రజానేత జగదీశ్వర్‌గౌడ్ చేసిన సేవలపై చిత్రీకరించిన సీడీని టీపీసీసీ మీడియా అండ్ కమ్యూనికేషన్స్ చైర్మన్ సామ రామ్మోహన్‌రెడ్డి, మాజీ హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్‌ల చేతుల మీదుగా అవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మంచితనాన్ని పంచుతూ, మానవత్వమే మతంగా, సమాజహితమే జీవిత ధ్యేయంగా ముందుకు సాగుతున్న జగదీశ్వర్ గౌడ్ సేవలను ప్రశంసించారు. సమాజంలో జగదీశ్వర్‌గౌడ్ వంటి నాయకులు అరుదుగా ఉంటారని, వారి నాయకత్వం ఎంత బలపడితే ప్రజలకు అంత బలం చేకూరుతుందని వారు తెలిపారు. అబద్దాలను, ఆడంబరాలను నమ్ముకుని రాజకీయాలు చేస్తున్న ప్రస్తుత కాలంలో నిజంగా ప్రజలపట్ల చిత్తశుద్ధి చూపుతున్న నాయకుడు జగదీశ్వర్‌గౌడ్ అని కొనియాడారు. ధర్మం వైపు నిజం వైపు బలంగా నిలబడి కొట్లాడుతున్న నాయకులకు రోజురోజుకు మరింత ప్రజాబలం తోడవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, శ్రీకృష్ణయూత్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్‌ను తరిమికొడదాం...యువతను కాపాడుకుందాం




**అత్తాపూర్ జూన్ 24,ప్రభాతవార్త :** యువత మదకాద్రవ్యాలకు దూరంగా ఉండాలని లక్ష్యాన్ని నిర్దేశించుకొని క్రమశిక్షణతో ముందుకు వెళ్లాలని రాజేంద్రనగర్ ఎసిపి శ్రీనివాస్,ఎస్‌హెచ్ఓ ముత్తు యాదవ్,డిఐ నవీన్ కుమార్ లు పేర్కొన్నారు.మంగళవారం రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రభుత్వం జూనియర్ కళాశాలలో డ్రగ్స్ వద్దు-జీవితం ముద్దు అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.విద్యార్థులతో కలిసి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేశారు.అనంతరం ఎసిపి శ్రీనివాస్,సిఐ ముత్తు యాదవ్ మాట్లాడుతూ..... విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని డ్రగ్స్‌ను తరిమి కోడదాం యువతను కాపాడుకుందామని అన్నారు.విద్యార్థులు తమ లక్ష్యాలను ఎంచుకొని మత్తు వైపు కాకుండా భవిష్యత్ వైపు అడుగులు వేయాలన్నారు.విద్యార్థులకు డ్రగ్స్ వినియోగం వల్ల ఆరోగ్యంపై కలిగే తీవ్ర దుష్ప్రభావాలు, విద్య మరియు భవిష్యత్తుపై పడే ప్రభావం, స్నేహితుల ఒత్తిడికి లొంగకుండా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. డ్రగ్స్ వ్యసనం నుండి బయటపడేందుకు కుటుంబ సభ్యులు, పోలీసులు లేదా కౌన్సెలర్ల సహాయం తీసుకోవాలని లేదా నీషా ముక్తా హెల్ప్‌లైన్ 14446 నెంబర్‌కు కాల్ చేయాలని అవగాహన కల్పించారు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుధారాణి ,ఎస్ఐ రాఘవేందర్ ముదిరాజ్, ఉపాధ్యాయులు,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

## ప్రకటనల రంగాన్ని క్రమబద్దీకరించడం హర్షణీయం

**తెలంగాణ అవుట్ డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్**



రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

**హైదరాబాద్,జూన్ 24,ప్రభాతవార్త:**
పట్టణ ప్రకటనల రంగాన్ని కమబద్దీకరించేలా ప్రభుత్వం జీవో నెం. 173ని తీసుకురావడం హర్షనీయనీయమని తెలంగాణ అవుట్ డోర్ మీడియా ఓనర్స్ అసోషియోషన్ ప్రధాన కార్యదర్శి కె. రమేష్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో అసోసియేషన్ సభ్యులతో కలసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అవుట్ డోర్ మీడియాను పూర్తిగా నియంత్రించిందని, కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం వచ్చాక రేవంత్ రడ్డి తమ సమస్యలను పరిష్కరించారని కోనియాడారు. దీంతో నగర వ్యాప్తంగా అవుట్ డోర్ మీడియా ఓనర్స్‌కు జీవన బృతి లభించిందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రవికాంత్ రెడ్డి, సాయి కృష్ణ,రామారావు,హరిప్రసాద్,శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఏపి మంత్రి సవితను కలిసిన వేముల లోకేష్



మంత్రి సవితను సన్మానిస్తున్న వేముల లోకేష్

**హైదరాబాద్,జూన్ 24,ప్రభాతవార్త:**
అఖిలభారత వడ్డెర సంక్షేమ సంఘం యూత్ ప్రెసిడెంట్ వేముల లోకేష్ ఏపీ బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్. సవితను బుధవారం కలిశారు. ఈమేరకు ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా వేముల లోకేష్ మాట్లాడుతూ క్వారీలలో 33 వాటాను వడ్డెరులకు కేటాయిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ. నెం. 126 జారీ చేసినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, అలాగే బీసీ సంక్షేమ శాఖ మంత్రికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశామన్నారు.అలాగే వడ్డెర సామాజిక వర్గానికి సంబంధించిన పలు అంశాలపై మంత్రికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వడ్డెరుల విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధి ,సంక్షేమానికి సంబంధించిన సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లగా, వాటి పరిష్కారానికి సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## విఎస్‌టి కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నాం : ప్రధాన కార్యదర్శి ఎల్ డి పాల్



విఎస్టి వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎల్ డి పాల్‌ను సత్కరిస్తున్న అధ్యక్షుడు మొగుళ్ళ రాజి రెడ్డి,విఎస్టి యూనియన్ అడ్వైజర్లు ఆర్డీ చంద్రశేఖర్, రాజు.

**చిక్కడపల్లి జూన్ 24 (ప్రభాతవార్త ) :** విఎస్‌టి కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని విఎస్టి వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎల్ డి పాల్ అన్నారు. బుధవారం బాగ్ లింగంపల్లి విఎస్టి యూనియన్ కార్యాలయంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎల్ డి పాల్ కు సన్మాన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిధులుగా ఐఎన్‌టీయూసీ అనుబంధ తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ళ రాజి రెడ్డి,విఎస్టి యూనియన్ అడ్వైజర్లు ఆర్డీ చంద్రశేఖర్, కె రాజు. చీఫ్ వైస్ ప్రెసిడెంట్ జి నాగేష్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఏ ఆర్ శ్రీనివాస్ యాదవ్,ఉపాధ్యక్షులు రణధీర్ రెడ్డి, సమ్మద్ , కోశాధికారి డి కృష్ణారెడ్డి, ప్రభాకర్, నవీన్, విజయేందర్, రామ్మోహన్, సాయి ప్రసాద్ రెడ్డి, డి.మల్లేశం తదితరులు పాల్గొన్నారు. ఎల్ డి పాల్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమ లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఆయన తెలిపారు.కార్మికుల హక్కుల రక్షణకు, వారి న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తామని ఆయన స్పష్టం చేశారు. యాజమాన్యంతో సామరస్యపూర్వకంగా చర్చిస్తూ కార్మికులకు మెరుగైన వసతులు, ప్రయోజనాలు చేకూరేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్మికులందరూ ఐక్యతతో ఉంటూ సంస్థ అభివృద్ధికి సహకరించాలని, అదే సమయంలో తమ హక్కులను కాపాడుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు.

## కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయటమే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే గాంధీ



ఇందిరామహిళా శక్తి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

**శేరిలింగంపల్లి, జూన్24 ప్రభాతవార్త**
మహిళా సంక్షేమం, ఆర్థిక స్వావలంబన దిశగా తెలంగాణ ప్రభుత్వం కృషిచేస్తుందని, కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయటమే రేవంత్‌రెడ్డి సర్కార్ లక్ష్యమని పీఏసీ చైర్మన్,శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అన్నారు. చందానగర్‌లోని డాక్టర్ అంబేద్కర్ కళ్యాణ మండపంలో మియాపూర్ సర్కిల్ పరిధిలోని ఆయా డివిజన్ల మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. మియాపూర్ సర్కిల్ పరిధిలోని ఆయా డివిజన్లలోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయటం చాలా సంతోషంగా ఉందన్నారు. మహిళాభ్యున్నతికి తెలంగాణ సర్కార్ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయటంతో పాటు వారిని స్వయం ఉపాధి రంగంలో ముందుకు తీసుకెళ్లేందుకు సంక్షేమ, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి కారయక్రమాలను అమలు చేస్తుందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయటమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ డిప్యూటి కమిషనర్ శ్రీనివాస్,ప్రాజెక్టు అధికారి స్వాతిరెడ్డి,మాజీ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాస్,మెప్మా అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళలు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెద్దలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత

**చిక్కడపల్లి జూన్ 24 ( ప్రభాతవార్త ) :** కుటుంబ నిర్మాణంలో కీలక పాత్ర పోషించే పెద్దలను గౌరవించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యతని వాకర్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ గంగాధర్ రెడ్డి అన్నారు. బుధవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య పార్క్ లో వాకర్స్ క్లబ్ అఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు ఎస్. మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గంగాధర్ రెడ్డి హాజరై క్లబ్‌కు చెందిన 60 ఏళ్ల పైబడిన వృద్ధులను సత్కరించారు. సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. మనోహర్ రెడ్డి మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో ఇంతటి అద్భుతమైన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన డిజిఇ కె. శైలజా మోహన్‌కు, ముఖ్య అతిథులకు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.ఐ.పి నాగభూషణం, పాస్ట్ ఎ.వి.పి సంపత్ రెడ్డి, ఐ.డి.జి లింగ ప్రకాష్,)క్లబ్‌ల అధ్యక్షులు, పూర్వ అధ్యక్షులు, సీనియర్ వాకర్స్,క్లబ్ సభ్యులు, అతిథులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తండ్రుల పట్ల కృతజ్ఞతను చాటుతూ సాగిన ఈ వేడుక అందరినీ ఆకట్టుకుంది.

## పెరి అన్నపూర్ణ అను కవితలు సంపుటి ఆవిష్కరణ



**చిక్కడపల్లి, జూన్ 24 ప్రభాతవార్త :**
చిక్కడపల్లి త్యాగరాయ గానసభ, కళా సుబ్బారావు కళా వేదికపై బుధవారం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పెరి అన్నపూర్ణ రచించిన అను కవితలు పుస్తకావిష్కరణ సభ గానసభ అధ్యక్షుడు కళావిఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ ముఖ్య అతిథిగా విచ్చేసి, కవితా సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కథలు, నవలలు స్త్రీలు ఎక్కువగా రాసేవారని, కవిత్వం అనేది పురుషుల ఆధిక్యత కలిగిన ప్రక్రియగా ఉండేదని గుర్తుచేశారు. కానీ నేడు కవయిత్రులు వివిధ వాదాల నేపథ్యంలో అద్భుతమైన కవితలు రాస్తున్నారని ప్రశంసించారు. రచయిత్రి అన్నపూర్ణ ఏ ఒక్క వాదానికో కట్టుబడకుండా, సమాజంలో జరుగుతున్న పలు సంఘటనలపై స్పందిస్తూ ఈ కవితలను అందించడం అభినందనీయమని కొనియాడారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించిన ఈ సభలో తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ ఉపాధ్యక్షుడు పొన్నాడ సుబ్రహ్మణ్యం, కుసుమ ధర్మన్న కళాపీఠం నిర్వాహకురాలు డాక్టర్ రాధా కుసుమ, పెరి శ్రీరామ్ తదితరులు పాల్గొని రచయిత్రి అన్నపూర్ణను ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు.

## ఇందిరమ్మ చీరల పంపిణీలో పారదర్శకత అవసరం

**: కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేశ్‌కుమార్**



మహిళలకు చీరలను పంపిణీచేస్తున్న కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేశ్‌కుమార్

**కుత్బుల్లాపూర్, జూన్24 ప్రభాతవార్త**
ప్రభుత్వం ప్రతిష్టాకంగా పంపిణీ ప్రారంభిస్తున్న ఇందిరమ్మ చీరల పంపీణీలో పారదర్శకత ముఖ్యమని కుత్బుల్లాపూర్ జోనల్‌కమిషనర్ పింకేశ్‌కుమార్(ఐఎఎస్)అన్నారు. బుధవారం జీడిమెట్ల సర్కిల్ కార్యాలయంలో జీడిమెట్ల సర్కిల్ ఉపకమిషనర్ శంకర్‌సింగ్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ చీరల పంపిణీని టౌన్‌లెవెల్ ఫెడరేషన్ అధ్యక్షులు దేవకరుణ నాయకత్వంలో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో చీరల పంపిణీ కార్యక్రమం ప్రారంభంనుండి చివరి వరకు అధికారులు, సిబ్బందితో కలిసి ఎస్ఎజి, నాన్‌ఎస్ఎజి విధానంలో ప్రతి ఒక్కరికీ చీరలు పంపిణీ అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ప్రాజెక్టు అధికారి ఇంద్రసేన, గాజులరామారం సర్కిల్ డిప్యుటీ కమిషనర్ వెంకటరాములు,టిఎల్ఎఫ్ ప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## స్థలం పేరుతో విశ్రాంత పోలీసు అధికారికి టోకరా

**జూబ్లీహిల్స్, జూన్ 24, ప్రభాతవార్తః**
స్థల విక్రయం పేరుతో ఒక మాజీ పోలీసు అధికారిని రూ. 2కోట్ల మేర మోసానికి పాల్పడిన ఇద్దరిపై బంజారాహిల్స్ ఠాణాలో కేసు నమోదైంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ ప్రాంతంలో నివసించే ఒక విశ్రాంత పోలీసు ఉన్నతాధికారి అయిన ఇ. శంకర్‌రెడ్డి తన పదవీవిరమణ ద్వారా లభించిన డబ్బుతో విక్రంపురి కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో 863 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఇందుకు సంబంధించి రణబీర్ అగర్వాల్, ఆయన తండ్రి అనిల్ కుమార్ అగర్వాల్‌లు విశ్రాంత అధికారిని నమ్మించి 2020 నుంచి 2022 మధ్య కాలంలో రూ.2.07 కోట్లకు పైగా ముందస్తుగా డబ్బులు తీసుకున్నారు. అనంతరం రిజిస్ట్రేషన్ చేస్తామని పలుమార్లు హామీనిచ్చినా చేయకుండా రోజులు గడుపుతూ వచ్చారు. దీనికితోడు నకిలీ రిజిస్ట్రేషన్ చలానా సృష్టించి విశ్రాంత అధికారికి అందించి అదనంగా రూ.75 లక్షలు ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్ చేయకుండా డబ్బులు డిమాండ్ చేస్తూ మోసానికి పాల్పడుతున్నట్లు గుర్తిం చిన శంకర్‌రెడ్డి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు ఇద్దరు నిందితులపై బీఎన్ఎస్ సెక్షన్లు 318(4), 316(2), 336(3), 61(2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

**ముషీరాబాద్, జూన్ 24, ప్రభాతవార్త:** రోడ్డు దాటుతున్న ఒక గుర్తు తెలియని వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొనటంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దోమలగూడ సీఐ అంజద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం అర్ధరాత్రి ముషీరాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కాళీ మందిర్ నుంచి రాంనగర్‌గుండు వైపు వెళ్తున్న క్రమంలో హిమాయత్‌నగర్ క్రీన్‌స్టోన్ వద్ద రోడ్డు దాటుతున్న ఒక వ్యక్తి (60)ని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందటంతో సమాచారం అందుకున్న దోమలగూడ పోలీసులు, మృతి చెందిన వ్యక్తిని పోస్ట్‌మార్టం నిమిత్తం గాంధీ హాస్పటల్‌కు తరలించారు. నిర్లక్ష్యంగా డ్రైవ్ చేసి, ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తెలిపారు. బస్సు ఢీకొని మృతి చెందిన వ్యక్తి కి సంబంధించి, విచారించగా, భిక్షాటన చేసుకుంటూ, ఫుట్‌పాత్‌పై నివసించే వ్యక్తిగా గుర్తించారు. ఎవరైనా ఆ వ్యక్తికి సంబంధించిన వారు ఉంటే దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

## ప్లాట్ ఫామ్-65 హోటల్లో ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు



రెస్టారెంట్లో పాచిపోయిన ఆహార పదార్థాలు నిల్వ ఉన్న దృశ్యం

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 24, ప్రభాతవార్త**
కూకట్‌పల్లిలోని భాగ్యనగర్ కాలనీలో గల ప్లాట్ ఫామ్ 65 హోటల్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రెస్టారెంట్లోని కిచెన్‌లో అపరిశుభ్రంగా ఆహార నిల్వలు ఉంచడంతోపాటు ఎలుకలు సంచరించడం గుర్తించారు. అదేవిధంగా ఫ్రిడ్జ్‌లో పాచిపోయిన ఆహార నిల్వలు అనగా మాంసం పదార్థాలు ఉన్నట్లు అధికారులు గ్రహించారు. అంతేకాకుండా వెజ్, నాన్ వెజ్ పదార్థాలను వేరువేరుగా ఉంచకుండా ఒకేచోట ఉంచినట్లు అధికారుల తనిఖీల్లో వెల్లడయింది. వినియోగదారులకు అందజేసే పదార్థాలు నాసిరకంగా ఉండడం, అపరిశుభ్ర వాతావరణంలో ఉండడంతో ఎఫ్ఎస్ఏఐ లైసెన్స్ రద్దు చేసేందుకు నివేదిక అందజేస్తున్నామని అంతేకాకుండా రెస్టారెంట్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు. రెస్టారెంట్లో పరిశుభ్రత రేటింగ్‌లో కేవలం 37 మాత్రమే పాటిస్తున్నారని నిబంధనల ప్రకారం 50 శాతం కంటే తక్కువ ఉంటే చర్యలు తీసుకోవడం జరుగుతుందని అధికారులు తెలియజేశారు. ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే విధంగా ఆహార పదార్థాలు అందజేస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## మియాపూర్‌లో ఎస్ఐఆర్‌పై అవగాహన సదస్సు



**శేరిలింగంపల్లి,జూన్24 ప్రభాతవార్త :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మియాపూర్ డివిజన్‌లోని విశ్వనాథ గార్డెన్స్ ఫంక్షన్‌హాల్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో పీఏసీ చైర్మన్, స్థానిక శాసనసభ్యులు అరికెపూడి గాంధీ, పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, యాదవ కోఆపరేటివ్ చైర్మన్ రఘునాథ్‌లు హజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదయ్యేలా చూసుకోవాలని సూచించారు. ప్రతి బూత్‌ను బలోపేతం చేయటమే కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలకు అన్ని విధాలా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని బూత్ కమిటీ అధ్యక్షులు, కన్వీనర్లు,సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 30లోపు పెన్షన్ దారులు లైవ్ అథెంటికేషన్ చేసుకోవాలి : తహసీల్దార్ అసదుల్లాఖాన్

**కంటోన్మెంట్,జూన్ 24 ప్రభాతవార్త:** మారేడ్‌పల్లి మండల రెవెన్యూ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ఆసరా పింఛన్ దారులు ఈ నెల 30లోపు లైవ్ అథెంటికేషన్ చేసుకోవాలని తహశీల్దార్ అసదుల్లాఖాన్ తెలిపారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తమ మండల పరిధిలో 12 వేల మంది ఆసరా పింఛన్ దారులు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు 8 వేల మంది లైవ్ వెరిఫికేషన్ చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఇంత వరకు లైవ్ వెరిఫికేషన్ చేసుకోని వారు ఎవరైనా ఉంటే ఈ నెల 30లోపు లైవ్ వెరిఫికేషన్ చేసుకోవాలన్నారు. లేని పక్షంలో జూలై నుంచి రావాల్సిన పింఛన్లు నిలిపి వేయడం జరుగుతుందన్నారు.

## క్రీడాకారులకు ప్రభుత్వం ప్రోత్సాహం : ఎమ్మెల్యే శ్రీగణేష్


పవర్ లిఫ్టింగ్ విజేతలను అభినందిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

**అడ్డగుట్ట,జూన్ 24 ప్రభాతవార్త:** క్రీడాకారులు కష్టపడి జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీల్లో విజయం సాధించాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. ఈ నెల 21న చాదర్‌ఘాట్ విక్టోరియో ప్లే గ్రౌండ్‌లో నిర్వహించిన జూనియర్,సబ్ జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో కంటోన్మెంట్‌కు చెందిన క్రీడాకారులు 12 బంగారు పతకాలు, 2 వెండి పతకాలను సాధించిన క్రీడాకారులను బుధవారం తుకారాంగేట్‌లోని ఎమ్మెల్యే నివాసంలో విజేతలను, కోచ్‌లను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కంటోన్మెంట్ కీర్తి పతాకాన్ని రెపరెపలాడించాలన్నారు. క్రీడాకారులకు తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. క్రీడాకారులను సిఎం రేవంత్ రెడ్డి ప్రోత్సహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అధికారి నంద కిషోర్,గోఖుల్, కోచ్ హేమలతలు పాల్గొన్నారు.

## రైల్వే ఉద్యోగుల కుటుంబాలకు సీసీఎస్ అండ : చిలుకు స్వామి


సీసీఎస్ షేర్ హోల్డర్ కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును అందజేస్తున్న అధ్యక్షులు డాక్టర్ చిలుకు స్వామి

**కంటోన్మెంట్,జూన్ 24 ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వేలో పనిచేస్తున్న ఉద్యోగులకు,వారి కుటుంబాలకు సీసీఎస్ అండగా నిలుస్తుందని ప్రెసిడెంట్ డాక్టర్ చిలుకు స్వామి తెలిపారు. రైల్వేలో పనిచేస్తున్న రూప్ సింగ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. వారి కుటుంబానికి అందాల్సిన ప్రయోజనాలను పరిశీలించగా 15 లక్షల రూపాయలు రుణం తీసుకోగా అందులో 12 లక్షల 76 వేల 661 రూపాయలు మాఫీ చేయగా ప్రమాద బీమా కింద రూ. 5 లక్షల చెక్కును సీసీ.ఎస్.అధ్యక్షుడు డాక్టర్ చిలుకు స్వామి చేతుల మీదుగా రూప్ సింగ్ సతీమణి నేనావత్ జైనా బాయికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీసీ.ఎస్.బోర్డు డైరెక్టర్లు క్రిష్ణయ్య, మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బీరప్ప మల్టీ పర్పస్ హాల్‌కు రూ.1 కోటి మంజూరు


కొలన్ హన్మంత్ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

**నిజాంపేట్, జూన్ 24, ప్రభాతవార్త**

తెలంగాణ ప్రభుత్వం నుంచి బీరప్ప మల్టీ పర్పస్ హాల్ నిర్మాణానికి రూ.1 కోటి నిధులు మంజూరు కావడం పట్ల కుర్మ సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి కృషితో ఈ నిధులు మంజూరయ్యాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కొలన్ హన్మంత్ రెడ్డిని బుధవారం కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు. బీరప్ప మల్టీ పర్పస్ హాల్ నిర్మాణం ద్వారా స్థానికులకు ఎంతో ఉపయోగం కలుగుతుందని కుర్మ సంఘ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కె.ఎం. గౌరీష్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కుర్మ సంఘ అధ్యక్షులు బట్ట బాలకృష్ణ, సూరారం విలేజ్ చైర్మన్ బట్ట నర్సింహా, ఆలయ అధ్యక్షులు బాలయ్య, పెంటయ్య, సెల్వియోజి సత్తయ్య, చిన్న సత్తయ్య, బాలరాజ్, కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సార్ నాయక్ నగర్ సమస్యలపై కమిషనర్‌కు వినతి


ఎస్సార్ నాయక్ నగర్‌లో పర్యటిస్తున్న కమిషనర్ శ్రీజన

**జీడిమెట్ల, జూన్ 24, ప్రభాతవార్త**

130వ ఉమ్మడి సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని ఎస్సార్ నాయక్ నగర్‌లో జీహెచ్ఎంసీ కమిషనర్ శ్రీజన పర్యటించిన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు ఆమెకు స్వాగతం పలికి స్థానిక సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ ప్రెసిడెంట్ ఆలూరి వెంకట శేషాచారి, బీఆర్ఎస్ నాయకుడు గుబ్బల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పీవీ భాస్కర్ రెడ్డి, శ్యామ్, హరిబాబు యాదవ్, పూర్ణ చందర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. స్థానిక పార్కు అభివృద్ధి, వాచ్‌మన్ రూమ్ మరమ్మతు, కొత్త నేమ్‌ప్లేట్ ఏర్పాటు, పాడైన వాకింగ్ ట్రాక్ పునరుద్ధరణ, లైట్లు ఏర్పాటు వంటి సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా శానిటేషన్, ఎంటమాలజీ విభాగాల్లో సిబ్బంది కొరత కారణంగా పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడం, ఫాగింగ్, స్ప్రేయింగ్ పనులు సక్రమంగా జరగడం లేదని వివరించారు. ఈ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారం చూపాలని బీఆర్ఎస్ నాయకులు విజ్ఞప్తి చేయగా, కమిషనర్ శ్రీజన సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, కొంపల్లి డిప్యూటీ కమిషనర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# రసవత్తరంగా సాగుతున్న బాస్కెట్‌బాల్ లీగ్


పోటీ పడుతున్న వరంగల్ స్టాలియన్స్, రంగారెడ్డి రాప్టర్స్

**హైదరాబాద్, జూన్ 24 ప్రభావార్త:** తెలంగాణా జూనియర్ బాస్కెట్‌బాల్ లీగ్(టిజెబిఎల్) రసవత్తరంగా సాగుతోంది. క్రీడాభిమానులు నుంచి మంచి ఆధరణ లభిస్తుండడంతో నిర్వాహకులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 19వ తేదీన నగరంలోని యూసఫ్‌గూడా కెవిబిఆర్ ఇండోర్ స్టేడియంలో ప్రారంభమైన పోటీలు 29వ తేదీ వరకు జరుగుతాయి. దేశంలోనే మొదటి సారి ఇటువంటి లీగ్‌ను తెలంగాణా బాస్కెట్ అసోసియేషన్ నిర్వహిస్తుండడం విశేషం. 1.42 కోట్లుతో ఫ్రాంచైజీలు 24 టీములను కొనుగోలు చేయడంతో లీగ్‌పై ఆసక్తి పెరిగింది. నువ్వా నేనా అనే స్థాయిలో పోటీలు సాగుతున్నాయి. ప్రతి పాయింట్ కోసం జట్లు పోరాడుతున్నాయి. పోటీలు లీగ్ ఆఖరి దశకు చేరుకున్నాయి. బలమైన టీములను పక్కన పెట్టి అండర్ డాగ్స్‌గా బరిలో నిలిచిన టీములు ఉత్తమమైన ప్రదర్శనతో దూసుకు పోతున్నాయి. అండర్ 15 బాలికల వరంగల్ స్టాలియన్స్ జట్టు పోటీదారులకు చుక్కలు చూపిస్తూ అత్యున్నతమైన ప్రదర్శనతో దూసుకు పోతోంది. హాట్ ఫేవరెట్లుగా బరిలోకి దిగిన రంగారెడ్డి రాప్టర్స్, వికారాబాద్ మాంబాస్, నిజాం రాయల్స్ జట్లు గట్టి పోటీని ఎదుర్కొంటున్నాయి. ఇదిలా ఉండగా కెవిబిఆర్ స్టేడియం ప్రతి రోజు ప్రేక్షకులుతో నిండిపోతోంది. టిక్కెట్లు కొనుగోలు చేసి పోటీలు తిలకిస్తున్నారంటే లీగ్‌కు ఎంత క్రేజ్ వచ్చిందో అర్థం చేసుకోవచ్చు. సెమీ ఫైనల్స్ ఈనెల 27, 28వ తేదీలులో 29వ తేదీన ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయి.

# మెట్రో ట్రైన్ రెండోదశపై ప్రభుత్వ ప్రకటన ప్రజాస్వామ్య విరుద్ధం


సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహ్మారెడ్డి

**సైఫాబాద్, జూన్ 24 ప్రభాతవార్త:** మెట్రో ట్రైన్ మొదటి దశపై సరైన అధ్యయనం, ఆడిట్ ప్రకటించకుండా ప్రయాణికుల ఇబ్బందులను తెలుసుకోకుండా 2వ దశపై ప్రభుత్వం ప్రకటన చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని సిటిజన్స్ ఫర్ బెటర్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ప్రతినిధి దొంతి నర్సింహ్మారెడ్డి, అర్బన్ డెవలప్‌మెంట్ ఫోరం ప్రతినిధి ఎం.శ్రీనివాస్, హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం ప్రతినిధి ఎం.శ్రీనివాస్‌రావు ఆరోపించారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఇప్పటికైన ఆడిట్ చేయించి, ఒక సమగ్ర ఆర్థిక నివేదికను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. ఐఆర్ఎఫ్‌సి రీఫైనాన్సింగ్ ఒప్పందం పూర్తి షరుతులను, నిబంధనలను, వ్యయాన్ని ఎవరు భరిస్తారనే దానితో సహా వెల్లడించాలని వారు కోరారు. కే ంద్రం అమోదానికి ముందు పేజ్-2 మార్గాలలో ప్రయాణికుల రద్దీ (డిమాండ్ అధ్యయనాలు), ప్రయాణికుల సంఖ్య అంచనాలు, సాధ్యా, సాధ్యాల మదింపులను ప్రజల ముందుంచాలని, ప్రతిపాదిత 7, రెండువ దశ కారిడార్ల వెంబడి ఉన్న నివాసితులతో అధికారిక ప్రజా సంప్రదింపులను ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఏమాత్రం ఆలస్యం చేయకుండా హైదరాబాద్ మెట్రోలో రోజువారి ఉద్యోగులు, చిన్న వ్యాపారస్తులు, విద్యార్థులు, వయోవృద్దుల కోసం ఆదాయ ఆధారిత ప్రయాణ రాయితీ పథకాన్ని ప్రవేశపెట్టాలని వారు డిమాండ్ చేశారు. వాణిజ్య భూ అభివృద్ధిఆధాయంతో సహా, పిపిపి కన్సెషనరీతో ఉన్న పూర్తి ఆధాయ పంపిణి ఒప్పందాన్ని వెల్లడించాలని కోరారు. ప్రస్తుతం మెట్రోలో కేవలం నాలుగున్నర లక్షల మంది ప్రయాణికులు మాత్రమే ప్రయాణిస్తున్నారని, ఈ మెట్రో ప్రయాణం సామాన్య ప్రజలకు, పేదలకు ఎంత మాత్రం అనుకూలంగా లేదని ఆరోపించారు. ప్రభుత్వం సామాన్య, పేద ప్రజలకు అనుకూలంగా ఉన్న ఎంఎంటిఎస్‌ను పట్టించుకోవడం లేదని, అభివృద్ధి చేయడం లేదని ఆరోపించా రు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఎంఎంటిఎస్‌కు 500 కోట్లు కేటాయించి, ఎంఎంటిఎస్ రైళ్ళ సంఖ్యను పెంచాలని, పూర్తిగా అభివృద్ధి చేయాలని వారు డిమాండ్ చేశారు.

## బిఎల్ఓలకు ఎస్ఐఆర్ మెటీరియల్ అందజేత


బి.ఎల్.ఓలకు ఎస్.ఐ.ఆర్.మెటీరియల్‌ను అందజేస్తున్న కంటోన్మెంట్ బోర్డు సిఈఓ అరవింద్ కుమార్

**కంటోన్మెంట్,జూన్ 24 ప్రభాతవార్త:**

కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లోని ఓటర్లను గుర్తించి నిస్పక్షపాతంగా పార్టీలకు అతీతంగా ఎస్.ఐ. ఆర్.సర్వే చేపట్టాలని సిఈఓ అరవింద్ కుమార్ ద్వివేది తెలిపారు. గురువారం ఈ నెల (25) నుంచి ఎస్.ఐ.ఆర్.సర్వే చేపట్టనున్న సందర్భంగా బుధవారం బి.ఎల్.ఓలకు ఎస్.ఐ.ఆర్.మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపరిండెంట్ ఎం.దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అల్వాల్ ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయండి

- ఫైర్‌అండ్ డిజాస్టర్ సేఫ్టీ డైరెక్టర్ జనరల్‌కు ఎమ్మెల్యే వినతి


విక్రం సింగ్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**అల్వాల్, జూన్ 24 ప్రభాతవార్త:** అల్వాల్‌లో అపరిష్కృతంగా ఉన్న ఫైర్ స్టేషన్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఫైర్ అండ్ డిజాస్టర్ సేఫ్టీ డైరెక్టర్ జనరల్ విక్రం సింగ్‌కు వినతి పత్రం అందించారు. బుధవారం నానక్‌రామ్ గుడాలోని ఫైర్ అండ్ డిజాస్టర్ సేఫ్టీ డైరెక్టర్ జనరల్‌కు చెందిన కార్యాలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఫైర్ స్టేషన్ ఏర్పాటులో ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. అల్వాల్ పరిసర ప్రాంతాలు జనభా దృష్ట్యా ఫైర్ స్టేషన్ అత్యంత కీలకమనే విషయాన్ని గుర్తించాలని ఎమ్మెల్యే కోరారు. అగ్ని ప్రమాదాలు అత్యవసర స్థితిలో ప్రజలకు సహాయకారిగా ఉండడానికి ఫైర్ స్టేషన్ అవసరమని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ప్రతిపాదనలకు అధిక ప్రాధాన్యత ఉంటుందని సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని డైరెక్టర్ జనరల్ విక్రం సింగ్ తెలిపారు.

# 27లోగా లైవ్ వెరిఫికేషన్ చేయించుకోవాలి

**ముషీరాబాద్ ఎమ్మార్వో రాణా ప్రతాప్ సింగ్**

**ముషీరాబాద్, జూన్ 24, ప్రభాతవార్త:**

ఈనెల 27లోగా ముషీరాబాద్ మండల పరిధిలోని పెన్షన్ దారులంతా తప్పనిసరిగా లైవ్ వెరిఫికేషన్ చేయించుకోవాలని స్థానిక ఎమ్మార్వో రాణా ప్రతాప్ సింగ్ సూచించారు. బుధవారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ వృద్ధాప్య, వితంతు, వికలాంగ, ఒంటరి మహిళ తదితర పెన్షన్లు పొందే లబ్ధిదారులు అందరూ ఈనెల 27వ తేదీ లోపల తమ ఆధార్‌కార్డులను తీసుకుని, తహసీల్దార్ కార్యాలయంలో జరిగే లైవ్ వెరిఫికేషన్ చేయించుకోవాలని, లేనిపక్షం వచ్చే నెల నుంచి పెన్షన్ నిలిచిపోతుందని హెచ్చరించారు. ఇప్పటి వరకు లైవ్ వెరిఫికేషన్ చేయించుకున్న వారికి ఇబ్బంది లేదని, వెరిఫికేషన్ చేయించుకోని వారు త్వరితగతిన చేయించుకోవాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి, సాయంత్రం 4 గంటల వరకు సంబంధిత కేంద్రాలతో పాటు తహసీల్దార్ కార్యాలయంలో వెరిఫికేషన్ చేయించుకునేందుకు అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని పెన్షన్ దారులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వెరిఫికేషన్ కోసం ఆధార్‌కార్డు, పెన్షన్ పాస్‌బుక్, మొబైల్ నెంబర్‌లతో హాజరవ్వాలని తెలిపారు.

## బడుగు బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



**ముషీరాబాద్, జూన్ 24, ప్రభాతవార్త:** బడుగు బలహీన వర్గాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కవాడిగూడ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు డి.రమేస్‌యాదవ్, నగర నాయకులు ఏ.లక్ష్మణ్‌లు స్పష్టం చేశారు. బుధవారం కవాడిగూడలోని తాళ్లబస్తీలో మహిళలకు ఇందిరమ్మ చీరలను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థిక సామాజిక అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. మహిళలు స్వయం అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నేతలు అంజయ్యగౌడ్, పోతరాజు భాస్కర్, రాము, మల్లేష్‌యాదవ్, ధర్మేందర్, శ్రీనివాస్, రాజేష్, అరుణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏం అభివృద్ధి జరిగిందని 'బస్సుయాత్ర' : లంబాడీ సంఘాల జెఏసి


ప్రెస్‌క్లబ్‌లో అభివాదం చేస్తున్న రఘురాం రాథోడ్, అశోక్‌రాథోడ్, నరేష్ రాథోడ్, సురేష్ నాయక్ తదితరులు

**హైదరాబాద్, జూన్ 24,ప్రభాతవార్త:** లంబాడాలకు కాంగ్రెస్ హయాంలో ఏం అభివృద్ది జరిగిందో గిరిజన ప్రజాప్రతినిధులు తెలుపాలని లంబాడ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటి ప్రశ్నించింది. బుధవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో లంబాడా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు రఘురాం రాథోడ్, అశోక్ రాథోడ్‌లు మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో లంబాడా తాండాలలో కాంగ్రెస్ లంబాడ ప్రజాప్రతినిదులు ప్రభుత్వానికి మద్దతుగా ఎం ముఖం పెటుకుని బస్సు యాత్ర నిర్వహిస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. లంబాడలను మోసం చేస్తూ ముఖ్యమంత్రి మెప్పు పొందేలా లంబాడ ప్రజాప్రతనిదులు ప్రవర్తించడం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో లంబాడాలకు ఎటువంటి ప్రయోజనం చేకూరలేదని, అయినప్పటికీ లంబాడా ప్రజాప్రతినిధులు ఇటువంటి యాత్రలు చేయడంలో అర్థం లేదన్నారు. లంబాడా బస్సు యాత్ర గురించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లంబాడాలకు తెలియజేసి అనంతరం బస్సు యాత్రను నిర్వహించాలని లంబాడ ప్రజాప్రతినిదులకు సవాల్ విసిరారు. ఈ సమావేశంలో నాయకులు నరేష్ రాథోడ్, మైదాన ప్రాంత సేవాలాల్ సంఘం నాయకులు సురేష్ నాయక్, రాజు నాయక్, రవి రాదోఢ్ పాల్గొన్నారు.

## పద్మారావు కుటుంబ సభ్యులను పరామర్శించిన శ్రీనివాస్ గౌడ్




**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 24, ప్రభాతవార్త**

తెలంగాణ ఉద్యమ నేత ప్రముఖ సినీ నిర్మాత బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు దివంగత గొట్టిముక్కల పద్మారావు ఇటీవల అకాల మరణం చెందిన విషయాన్ని తెలుసుకున్న మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ కూకట్‌పల్లిలోని పద్మారావు నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ముందుగా పద్మారావు చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. గొట్టిముక్కల పద్మారావు అకాల మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసి పద్మారావు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పద్మారావు కూకట్‌పల్లి ప్రాంతంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. స్వరాష్ట్ర సాధనలో పద్మారావు నిస్వార్థ పోరాటం ఉద్యమకారులకు స్ఫూర్తిదాయకమని అన్నారు. కూకట్‌పల్లి ప్రాంతంలో మంచి గుర్తింపు పొందిన గొట్టిముక్కల పద్మారావు నివాళికి గుర్తుగా ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శకులు ఎస్వీ కృష్ణారెడ్డి, నిర్మాత అచ్చిరెడ్డి, గొట్టిముక్కల పాండురంగారావు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ఆస్కానీ మారుతి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం : జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దీపక్ జాన్


కార్యక్రమంలో మాట్లాడుతున్న సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దీపక్ జాన్

**సికింద్రాబాద్, జూన్ 24 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం దేశంలోని విద్యావ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేస్తోందని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దీపక్ జాన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం పద్మారావునగర్‌లోని సికింద్రాబాద్ డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యావ్యవస్థలో జరుగుతున్న అక్రమాలు, అవకతవకలను ప్రజల ముందుకు తీసుకువెళ్లేందుకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ చాత్రో కి గూంజ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నీట్, ఐఐటీ, యూపీఎస్సీ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల ఫీజుల ద్వారా సుమారు రూ. 1.30 లక్షల కోట్లు వసూలు చేస్తోందని, ఈ మొత్తం ఐదు ప్రభుత్వ శాఖల వార్షిక బడ్జెట్‌తో సమానమని ఆయన వివరించారు. ఇంత భారీ మొత్తంలో నిధులు సమకూరుతున్నప్పటికీ, వరుస పేపర్ లీకేజీలు, పరీక్షల రద్దు కారణంగా పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యపూరిత వైఖరి వల్లే దేశంలో ఇప్పటివరకు పదుల సంఖ్యలో అమాయక నీట్ విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని మండిపడ్డారు. విద్యావ్యవస్థ వేదికగా కేంద్రం సాగిస్తున్న ఈ దోపిడీని ప్రతి విద్యార్థికి వివరించేలా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని దీపక్ జాన్ హెచ్చరించారు. వరుస పేపర్ లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసినా, కేంద్ర ప్రభుత్వంలో కనీస చలనం లేకపోవడం సిగ్గుచేటన్నారు. ఈ మీడియా సమావేశంలో సికింద్రాబాద్ జిల్లాకు చెందిన పలువురు ముఖ్య కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

## మాజీ కౌన్సిలర్ పాడె మోసిన ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు

**యూసుఫ్‌గూడ, 24 జూన్, ప్రభాతవార్త :** మోతీనగర్ డివిజన్‌లో మాజీ కౌన్సిలర్ సీహెచ్ సత్యనారాయణ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు అన్నారు. గత కొద్ది రోజులుగా అవంతినగర్ తోటకు చెందిన మాజీ కౌన్సిలర్ సీహెచ్ సత్యనారాయణ చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న కృష్ణారావు అక్కడికి చేరుకుని సత్యనారాయణ పార్థీవ దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. సీహెచ్ సత్యనారాయణ మొదటి నుంచి రాజకీయాల్లో చురుకుగా ఉంటూ అభివృద్ధికి కృషి చేయటంతో పాటు ఎమ్మెల్యే కృష్ణారావుకు చిరకాల మిత్రుడిగా నిలిచారు. బుధవారం ఆయన అంత్యక్రియలకు కృష్ణారావు స్వయంగా పాడె మోసి అంత్యక్రియలు అయ్యే వరకు ఉండి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.



# ప్రజల మధ్య ఉండే నాయకులకు గుర్తింపు

**యూసుఫ్‌గూడ, 24 జూన్, ప్రభాతవార్త :** అనునిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజల కోసం పాటు పడే గొప్ప మనసున్న నాయకుడు మాజీ మంత్రి జీవన్‌రెడ్డి అని సీనియర్ బీఆర్ఎస్ నాయకులు కొండం సంపత్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా గాయిత్రినగర్ డివిజన్ నుంచి నాయకులు కార్యకర్తలతో కలసి వెళ్లి మర్యాదపూర్వకంగా జీవన్‌రెడ్డిని కలవడం జరిగింది. పార్టీ కార్యక్రమాలతో పాటు ప్రజా సమస్యలపై చర్చించడం జరిగిందని పేర్కొన్నారు.



## పార్టీ అభివృద్ధిలో యువత పాత్ర కీలకం : బండి రమేష్



**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 24, ప్రభాతవార్త**

ఏ పార్టీకైనా యువతే వెన్నెముకగా నిలుస్తుందనీ, పార్టీ అభివృద్ధి కోసం మన బాధ్యతను మనం చేస్తూ పోతే నాయకులను గుర్తించే బాధ్యతను పార్టీ చూసుకుంటుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు కమ్మ కార్పొరేషన్ చైర్మన్ కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ సలీం ఆధ్వర్యంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ మీటింగ్ బుధవారం కెపిహెచ్‌బి కాలనీలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బండి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా యువతను బండి రమేష్ ఉద్దేశించి మాట్లాడుతూ ఏ పార్టీకైనా యువతే వెన్నెముకగా నిలుస్తుందన్నారు. పార్టీ అభివృద్ధిలో దేశ అభివృద్ధిలో యువతపాత్ర కీలకమన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేయడం ద్వారా గుర్తింపు గౌరవం లభిస్తుందన్నారు. పార్టీ ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరించడం ద్వారా వారికి మరింత దగ్గర కావచ్చని తద్వారా మరిన్ని అవకాశాలు అందివస్తాయన్నారు. పనితీరుతో తనకు పార్టీ సముచిత స్థానం కల్పించిందన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి, దేశంలో రాహుల్ గాంధీ (ఆర్‌ఆర్‌ఆర్, ట్రిబుల్ ఆర్) నాయకత్వాన్నీ బలపరచాలని పార్టీని గెలిపించేందుకు ప్రతినాయకుడు ప్రతి కార్యకర్త నేటి నుంచే గట్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలోయూత్ స్టేట్ ఇంచార్జి భవ్య, మేడ్చల్ మల్కాజ్గిరి డిస్ట్రిక్ట్ ఇంచార్జి రామ్ ప్రసాద్, స్టేట్ సెక్రటరీ రమ్య, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మక అజయ్, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు .

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**నిజాంపేట్, జూన్ 24, ప్రభాతవార్త**

నిజాంపేట్ పరిధిలో చెట్ల కొట్టివేత, నిర్వహణ పనుల కారణంగా నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు బుధవారం నిజాంపేట్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు 11 కేవీ డబుల్ బెడ్‌రూమ్ ఫీడర్ పరిధి లోని జర్నలిస్ట్ కాలనీ, డబుల్ బెడ్‌రూమ్ కాలనీలు, పరిసర ప్రాంతాల్లో ఉండనుంది. అలాగే మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ రాజధాని ఫీడర్ పరిధిలోని నిజాంపేట్ గ్రామం, గ్రామపంచాయతీ ప్రాంతం, రెడ్డీస్ అవెన్యూ, కుమ్మరి బస్తీ, సాయిబాబా కాలనీ, రేష్మా హాస్పిటల్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉండనుంది. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని అధికారులు కోరారు.

**కిషన్‌బాగ్‌లో :** విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 25వ తేదీ గురువారం 9 నుంచి 12 వరకు కిషన్ బాగ్, అవుట్ పోస్ట్,జల్వా హోటల్, చిరాగ్ అలీ నగర్,కిషన్‌బాగ్,జూ పార్కు క్వార్టర్స్,బహదూర్‌పుర,2 నుంచి సాయంత్రం 5 గంటలు వరకు బహదూర్‌పుర,ఎంఏ కాలనీ,కిషన్‌బాగ్,మహమూద్ నగర్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు.


**IN THE COURT OF THE HON'BLE I MEDCHAL-MALKAJGIRI PRL. DISTRICT AND SESSIONS JUDGE, DISTRICT; AT:: KUSHAIGUDA**
**I.A No. 75 OF 2024**
**IN**
**O.S. NO. 1304 OF 2015**

Between:-
E.Sattamma & others ....Petitioners/Plaintiffs
AND
Pasuladhi Bixapathy and others .....Respondents/Defendants

**NOTICE**

To,
1.Smt. Pulamoni Jyothi, W/o P.Narsimha, D/o Kavali Bixshapati Pasuladsi Bikshapathi, Aged about 34 years, Occ: House wife, R/o 6-112, Juluru village, Pochampally Mandal, Yadadri Bhongir District. ....(Respondent No. 8)
2.Smt.K.Vani W/o Ajay Kumar, Aged about 40 years, Occ: Housewife, R/o H.No. 1-6-77, Hanumanwada, Bhongiri Mandal, Yadadri Bhongir District. ....(Respondent No.11)
3. Smt.P.Sandhya W/o Dhanraj, Aged about: 36 years, Occ: Housewife, R/o.H.No. 1-177, Kuntlur, Hayathnagar Mandal, R.R.District. ....(Respondent No. 12)
4. Smt.Tumala Chandrakala W/o Venkatesh, D/o Narsaiah, Aged about 42 years, Occ: House wife, R/o Naginenipally Village, Bommalaramaram Mandal, Yadadri Bhongir District ....(Respondent No. 15)
5. Boini Parijatha, W/o Naresh, Aged about 32 years, Occ: Housewife, R/o.H.No. 2-9-Adarshapally Village Shamirpet Mandal, Medchal Malkajgiri District ....(Respondent No. 16)
6. P.R.K. Dass S/o Narsaiah, Aged about 69 years, Occ: -Business R/o H.No. 77, Ramanthapur, Hyderabad ....(Respondent No. 19)
7.G.Srinivas Sharma S/o Not known to the plaintiffs, Aged about: 53 years,. Occ: Business R/o.H.No.. Boduppal Ghatkesar Mandal, Medchal-Malkajgiri District ....(Respondent No. 21)
8. P.Savitri W/o P.Ravinder Aged about: 49 years, Occ: housewife, R/o. H.No. 10-15, Mandal & Village Uppal, Medchal-Malkajgiri District. ....(Respondent No. 22)

The above-named Petitioners filed the above petition vide L.A No. 75 of 2024 in O.S No. 1304 of 2015 against the Respondents/Defendants for Final Decree and the said matter stands posted to **06.02.2025.** If anybody is having any objections for the said declaration they can appear before the Hon'ble Court on the above said date. Hence you are hereby directed to appear before the Court on **09.07.2026 at 10.30 A.M.** either in person or through your Advocate, in case of your failure the matter will be decided in your absence.

**// BY ORDER OF THE COURT //**
**Sd/- K. V. SUDHAKAR**
**G. ROOPA REDDY, SUNDEEP.R.P**
**ADVOCATES**
**Counsel for the Petitioners/Plaintiffs.**
Flat No. 501, Prashanthi Nilayam, Road No-3,Green Hills Colony, Kothapet, Hyd.

**వార్త VAARTHA CLASSIFIEDS**

**CHANGE OF NAME**

★ I, **Deepika Metri** D/o. Metri Marurhi R/o. H.No. 8-4-368/45, GF, Hemavarhi Nagar Mothinagar, Erragadda, Balanagar (M), Medchal Malkajgiri Dist TG. Changed My Name as **Metri Deepika** D/o. Metri Maruthi.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

**తెలంగాణ ప్రభుత్వం**
**హైదరాబాద్ మహానగర పాలక సంస్థ**

నిట్ నెం: 06/EE-II/Circle-35/ఖైరతాబాద్ జోన్/GHMC/2026-27, తేది: 23.06.2026.
నిట్ నం. పైన పేర్కొన్నది, పని యొక్క పేరు : సివిల్ పనులు (05నం.లు). అంచనా మొత్తం/ECV : రూ.38.00 లక్షలు. ప్రారంభ తేది డౌన్‌లోడ్ ముగింపు తేది, సమయం : క్ర.సం. 01 నుండి 01కు వర్క్ చేసేల కొరకు : 24.06.2026, ప.12.00గం. నుండి 25.06.2026 మ.12.00గం.వరకు మాత్రమే. మరియు క్ర.సం. 02 నుండి 05వ : 24.06.2026, మ.12.00గం. నుండి 27.06.2026 మ.12.00గం.వరకు మాత్రమే. అధికారి పేరు మరియు చిరునామా : ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, KZ, GHMC, తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ఇంటర్నెట్ https://www.tender.eprocurement.gov.in వద్ద పొందవచ్చును. ఇ-మెయిల్ చిరునామా : eec35.khairatabad@gmail.com మొబైల్ నెం. 7331189501.
సం/-, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, ఖైరతాబాద్ జోన్, GHMC.
DIPR.NO.4866-PP/CL/ADVT/1/2026-27 తేదీ: 24.06.2026

**IN THE COURT OF THE HON'BLE Prl. JUNIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT: MEDCHAL**
**O.S. No. 950 OF 2025**

**BETWEEN:**
Rupa Sharma and others ...Plaintiffs
AND
Tahsildhar of Quthbullapur Mandal ...Defendants

**NOTICE**

Please take notice that the above said Hon'ble Court has directed to issue notice to you to appear before the said Hon'ble Court vide in O.S. No. 950 of 2025 on the file of Prl. Junior Civil Judge court at Medchal, the plaintiffs are filed the suit for the relief to declaration to declare the plaintiffs are legal heirs of Late Neel Kanth Sharma and above said case is posted to 08-07-2026 for your appearance, make it convenient to appear on the said dated at 10:30 am either in person or through your counsel failing which the matter will be decided in your absence and you will become ex parte from the court proceedings.

Hence, be present before the said Hon'ble Court on 08-07-2026 in person or through your Counsel by 10:30 A.M without fail.

**M/s. BURMA CHAKRAPANI**
**ADVOCATE**
G-1, Sai Datta Apartment, Central Park, Kompally Municipality, Gandimaissama-Dundigal Mandal, Medchal-Malkajgiri District.
**Ph: 9848068958.**

**NOTICE**
**IN THE COURT OF THE HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI, AT: KUSHAIGUDA**
**O.S.No. 481 of 2026**

**Between:**
Pidaparthi Ratnamala & Others ...Plaintiffs
AND
1. The Tahsildar/Mandal Revenue Office, Malkajgiri, Medchal-Malkajgiri District, at Naredmet.
2. All concerned ...Defendants

To,
All Concerned

**NOTICE**

The above named plaintiffs have filed suit for Declaration to Declare the planitiffs are the legal heirs of Late Pidaparty Nageswara Rao, who had acquired the schedule property as absolute owner and peaceful possessor of property in Plot No.64 and Plot No.65/B in survey No.804 & 806 (Old) & 906 (New), admeasuring 791.00 Sq.yards, the individual undivided 1/25th share being 31.6 Sq.yards, situated at Geetha Nagar, Malkajgiri, Vallabh Nagar Taluq, Ranga Reddy District (Now Malkajgiri, Medchal-Malkajgiri District) and bounded by: NORTH : Plot No.63, SOUTH : Plot No.65/A & Plot No.65/C, EAST : Plot No.68 & 66, WEST : 21"-0 Wide Road and against the defendant which is posted to 11-02-2025 for appearance.

Any person or persons having any objection or claim may appear through person or pleader with relevant documents if any before the above court at 10:30 AM on 29-06-2026 or else the mater will be decided ex-party.

**// BY ORDER OF THE COURT //**
**Sd/- R.VIJAYA BHASKAR**
ADVOCATE
Office at 1-8-161/7, P.G.Road, Paradise, Secunderabad
**Cell No: 98498 41623, 99851 88288**

**IN THE COURT OF THE HON'BLE PRL.DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT AT: L.B.NAGAR.**
**I.A.No. 337 of 2026**
**In**
**A.S.SR. No. 12206 Of 2025**

**Between:**
Kadiyala Venkateshwarlu S/o Late K.Seethaiah, Aged about 65 years, Occ: Retired employee, R/o Flat No.307, Block-10, Dhivya Shree Shakthi Apartment, Mayurinagar, Miyapur, Ranga Reddy Dist-49. ...Appellant/Third Party
AND
1. Smt Kandala Vijayalaxmi W/o Yella Reddy, D/o Karre Yadireddy, Aged about 52 years, Occ: Housewife, R/o H.No.8-105, Upparguda Village, H/o Koheda, Hayathnagar Mandal, Ranga Reddy District. & Others ...Respondents/Plaintiffs

To,
Smt Kaila Nirmala W/o Jayaprakash Reddy, D/o Karre Yadi Reddy, Aged about 48 years, Occ: Housewife, R/o H.No. 3-1-171, Hyderguda, Rajendranagar Mandal, Ranga Reddy District.
...Respondent No.2 /Plaintiff No.2

Please take notice that the Appellant KadiyalaVenkateshwarlu filed I.A.No. 337 of 2026 In A.S.SR.No.12206 of 2025 seeking leave of the Hon'ble Court to prefer Appeal against the judgment and Decree in O.S.NO. 1760 OF 2013dated 10th July, 2014 on the Court of VIII Additional Senior Civil Judge, RangaReddy District at L.B.Nagar.

Whereas the service of summons could not be effected in the ordinary manner on Respondent No.2/Plaintiff No.2, hence paper publication has been ordered by the Hon'ble Court and the Hon'ble Court Posted the matter on 3-07-2026 for your appearance in person or through your counsel at 10.30 A.M, failing which the matter will be heard on merits.

**//By Order of the Hon'ble Prl.District Judge, Ranga Reddy District//**
**G. RAVI**
**RAMA DASU MOTE**
**ADVOCATES**
#2-3-703/B/2/16/1,Thirumala Nagar, Amberpet, Hyderabad-500 013
**Mobile.9866160231**
Counsel for the Appellant

## ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి : ఇన్‌స్పెక్టర్ నరసింహ



గడ్డి అన్నారం లోని అషుర్ ఖానాలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఇన్స్పెక్టర్ కుంభం నరసింహ, చిత్రంలో మలక్ పేట మైత్రి కన్వీనర్ లింగాల శ్రీనివాస్ గౌడ్ తదితరులు

**మలక్ పేట, జూన్ 24,ప్రభాతవార్త:**
ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని మలక్ పేట ఇన్ స్పెక్టర్ కుంభం నరసింహ పేర్కొన్నారు. గడ్డిఅన్నారం లోని అషుర్ ఖానలో మలక్ పేట మైత్రి కన్వీనర్ లింగాల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ కుంభం నరసింహ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. మైత్రి కన్వీనర్ లింగాల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మొహరం సందర్భంగా ప్రతి సంవత్సరం గడ్డి అన్నారంలోని అషుర్ ఖానాలో పలు ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో లింగాల శివకుమార్ గౌడ్, ఫెరోస్, అజ్మల్, అఫ్రోజ్, బిల్డర్ శివకుమార్, పాషా తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలు సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపాలు : మాజీ హోం మంత్రి మహమూద్ అలీ



బీబీక ఆలంకు దట్టీలను సమర్పిస్తున్న మాజీ హోం మంత్రి మహమ్మద్ అలీ తదితరులు

**మలక్ పేట, జూన్ 24,ప్రభాతవార్త:**
ఉత్సవాలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిరూపాలని మాజీ హోం మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. డబిల్ పూరలోని బీబిక ఆలంను సందర్శించి దట్టీలను సమర్పించి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ కలిసిమెలిసి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లాయక్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## మతసామరస్యానికి ప్రతీకగా మొహర్రం వేడుకలు



**నేరేడ్ మెట్ , జూన్ 24,,ప్రభాతవార్త :** మొహరం పండుగ త్యాగం, ధర్మం, మానవతా విలువలకు ప్రతీకగా నిలుస్తుందని తెలంగాణ ఉద్యమకారుడు శేఖర్ గౌడ్ పేర్కొన్నారు. వినాయక్‌నగర్ 185వ డివిజన్ పరిధిలో స్థానిక ముస్లిం సోదరులతో కలిసి మొహరం ఏర్పాట్లను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మొహరం పర్వదినం మత విశ్వాసాలకు మాత్రమే పరిమితం కాకుండా పరస్పర గౌరవం, సోదరభావం, సామాజిక ఐక్యతను పెంపొందించే పవిత్ర సందర్భంగా భావించాలన్నారు. వివిధ మతాలకు చెందిన ప్రజలు పరస్పర సహకారంతో పండుగలను జరుపుకోవడం తెలంగాణ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపని తెలిపారు. ఈ సందర్భంగా షేక్ దావీద్, షేక్ నవాజ్, మహమ్మద్ ఖాబరీస్, షేక్ అజీర్, షేక్ సలీం మాట్లాడుతూ మొహరం వేడుకలను సంప్రదాయబద్ధంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు స్థానిక యువత, పెద్దలు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పండుగ రోజుల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నామని పేర్కొన్నారు. మొహరం వేడుకలు మతసామరస్యానికి నిదర్శనంగా నిలిచి, సమాజంలో ఐక్యతా భావాన్ని మరింత బలోపేతం చేయాలని పలువురు ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజలు, యువకులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## శ్రీ చిలుకేశ్వర ఆలయంలో కోటిలింగాల స్థాపన



శ్రీ చిలుకేశ్వర ఆంజనేయ స్వామి ఆలయంలో కోటి లింగాల స్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, శివారెడ్డి తదితరులు

**ఉప్పల్, జూన్ 24 ప్రభాతవార్త :**
చిలుకానగర్ హరిహర క్షేత్రం శ్రీ చిలుకేశ్వర ఆంజనేయ స్వామి దేవస్థానంలో బుధవారం కోటిలింగాల స్థాపన కార్యక్రమం ప్రారంభమైంది. వేదపండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కి ఘన స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే ప్రత్యేక పూజల్లో పాల్గొని, కోటిలింగాల స్థాపన కార్యక్రమాన్ని తిలకించారు . ఆలయ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. భక్తుల ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో సానుకూల మార్పులకు దోహదపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ మేకల శివారెడ్డి, సల్ల రాజి రెడ్డి, జల్లి మోహన్, ఆలయ కమిటీ అధ్యక్షుడు దాసరి కృష్ణ , గోనె శ్రీకాంత్, దేవసాని బాలచందర్, పలువురు ఆలయ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు కార్యకర్తలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా బ్రహ్మోత్సవ కళ్యాణం



స్వామివారిపై తలంబ్రాలు పోస్తున్న పురోహితుడు

**ఎల్.బి.నగర్, జూన్ 24 ప్రభాతవార్త:** శ్రీవెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవ కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణ మధ్య స్వామివారి బ్రహ్మోత్సవ కళ్యాణం సాంప్రదాయబద్దంగా నిర్వహించారు. కొత్తపేట సౌభాగ్యపురం కాలనీ లోని శ్రీఅలివేలుమంగ పద్మావతి గోదాసమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో పంచాదశ వార్షిక బ్రహ్మోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్వామివారికి బ్రహ్మోత్సవ కళ్యాణం భక్తుల కోలాహలం మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు. సాయంత్రం యాగ శాలలో చతుస్థానార్చనలు, కాలనీ పురవీధులలో గరుడ వాహనోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

# జోరుగా అక్రమ నిర్మాణాలు..పట్టించుకోని అధికారులు

## అనుమతులు గోరంత... నిర్మాణాలు కొండంత



బలిజగూడ రోడ్డులో కొనసాగుతున్న భారీ షెడ్డు నిర్మాణం



శాంతినగర్‌లో రోడ్డుపక్కన నిర్మాణం

**హయత్ నగర్, జూన్ 24 ప్రభాత వార్త :**
నాగోల్ సర్కిల్ పెద్ద అంబర్ పేట, కుంట్లూరు డివిజన్ల పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నా అధికారులు మిన్నకుండి పోతున్నారు. ఓవైపు స్థానిక నాయకులు, మాజీ ప్రజాప్రతినిధుల సహకారంతో అనుమతులు తెసుకోకుండానే నిర్మాణాలు చేస్తున్నారు. మరోవైపు రెసిడెన్సియల్ నిర్మాణ అనుమతులు తీసుకుని వ్యాపార వాణిజ్య సముదాయలు నిర్మిస్తున్నా... మామూళ్ళ మత్తులో తూగుతున్న అధికారులు అటుపైపు కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు విన్పిస్తున్నాయి. పెద్ద అంబర్ పేట నుండి బలిజగూడ వెళ్లే దారిలో శాంతినగర్ కాలనీలో రోడ్డును ఆక్రమిస్తూ షెట్టర్ నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. భవిష్యత్తులో ఆరోడ్డులో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఇక ఔటర్ సర్వీస్ రోడ్డు దాటిన తరువాత బలిజగూడ రోడ్డులో పాత నిర్మాణం స్థానంలో భారీ షెడ్డు నిర్మాణం శరవేగంగా సాగుతుంది. ఇలాంటి నిర్మాణాలు కుంట్లూరు, పసుమాముల, తట్టి అన్నారం గ్రామాల్లో అనేకం కొనసాగుతున్నాయి. అయితే అన్ని తెలిసి టౌన్ ప్లానింగ్ అధికారులు అందిన కాడికి దండుకుంటూ వారికి వత్తాసు పలుకుతున్నా రన్న ఆరోపణలు విన్పిస్తు న్నాయి. అక్రమ నిర్మాణాలతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా అధికారులు నిద్రమత్తును వీడడం లేదు. ఉన్నతధికారులు స్పందించి కిందిస్థాయి అధికారులు సిబ్బందికి సరైన దిశనిర్దేశం చేసి అక్రమ నిర్మాణలపై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది

## కనులపండువగా కల్యాణ వెంకటేశ్వర స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం



**నేరేడ్ మెట్ , జూన్ 24,ప్రభాతవార్త :**
వినోబానగర్‌లోని శ్రీ భూదేవి, శ్రీదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న చతుర్థ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల రెండో రోజు బుధవారం నిర్వహించిన స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం భక్తులకు కనులపండువగా నిలిచింది. ఉదయం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ మూలమంత్ర హవనం, గణపతి హవనం, దుర్గా హవనం, నవగ్రహ హవనాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం నిత్య పూర్ణాహుతి, బలిహరణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆ తర్వాత శ్రీనివాస స్వామివారి తిరుకల్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భక్తిపారవశ్యంలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో దేవస్థాన పాలక మండలి సభ్యులు, జీవిత కాల సభ్యులు, భగవద్బంధువులు, మహిళలు, యువతతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు విశేషంగా పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణం భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించగా, కల్యాణ మూర్తులకు 108 స్వర్ణపుష్పార్చన, కుంకుమార్చన, మూల మంత్ర హవనం, రుద్ర హవనం తదితర విశేష పూజలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి ఊరేగింపు ఆలయ పరిసర ప్రాంతాల్లో భక్తుల జయజయధ్వానాల నడుమ వైభవంగా సాగింది. కార్యక్రమాల ముగింపులో నిత్య పూర్ణాహుతి, బలిహరణం నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. చతుర్థ వార్షిక బ్రహ్మోత్సవాల చివరి రోజైన గురువారం మహా పూర్ణాహుతి, చక్రస్నానం నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ వెల్లడించింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కమిటీ సభ్యులు కోరారు.

## రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడం పట్ల హర్షం



గణేష్‌నేతను సన్మానిస్తున్న కాలనీవాసుల

**ఎల్.బి.నగర్, జూన్ 24 ప్రభాతవార్త:**
కాలనీ ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రోడ్డు నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయించడం జరిగిందని ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ వాసవికాలనీ రోడ్‌నెంబర్ 1/ఏలో గత 20 సంవత్సరాల క్రితం వేసిన సీసీ రోడ్డు గుంతల మయంగా మారి వర్షాకాలంలో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది పడుతున్న దృష్ట్యా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సమస్యను పున్న గణేష్ దృష్టికి తీసుకురాగా ఆయన మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి సహకారంతో ఎల్బీనగర్ జోనల్‌కమిషనర్ వికాస మహాతో వద్దకు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను తీసుకువెళ్లి సమస్యను వివరించారు. వెంటనే డిప్యూటీ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఏఈఈ తదితర అధికారులను కలసి నిధులు మంజూరు చేయించడంతో బుధవారం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పున్న గణేష్‌నేతను శాలువాతో సంబంధించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా గణేష్‌నేత మాట్లాడుతూ అభివృద్ధికి నిధులు కేటాయించిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. డివిజన్ పరిధిలోని కాలనీలలో ఉన్న అన్ని సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్‌రావ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పగడాల ఎల్లన్న, వాసవికాలనీ రోడ్‌నెంబర్ 1/ఏ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జెల్లా జగన్నాథం, కార్యదర్శి మల్లేష్‌యాదవ్, లింగారెడ్డి, పురుషోత్తంగుప్త, శ్రీధర్‌రెడ్డి, భాస్కర్, సుధాకర్‌శర్మ, సుధాకర్‌గుప్తా, సూర్య నారాయణగుప్త, సురేష్‌గౌడ్, అచ్చయ్య, శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చెరువులు కబ్జా చేస్తే వదిలిపెట్టం : ఎల్‌బినగర్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి మధుయాష్కీ గౌడ్



బైరామల్‌గూడ చెరువు పరిశీలిస్తున్న మధుయాష్కీ గౌడ్

**సైదాబాద్, జూన్ 24 ప్రభాతవార్త:** చెరువులు కబ్జా చేస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని ఎల్‌బినగర్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి మధుయాష్కీ గౌడ్ అన్నారు. బైరామల్‌గూడ చెరువు సుందరీకరణ పనులను అధికారులతో కలసి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చెరువులన్నీ కబ్జాలకు గురయ్యాయని అన్నారు. బైరామల్‌గూడ చెరువు ఆరు ఎకరాలకు పైగా విస్తరించి ఉండగా కబ్జాలకు గురై ఇప్పుడు కేవలం రెండు ఎకరాలు మాత్రమే మిగిలిందన్నారు. చెరువు ఆక్రమణలను వదిలిపెట్టేది లేదని హైడ్రాకు ఫిర్యాదు చేస్తామని అన్నారు. చెరువు స్థలాన్ని కబ్జాల నుండి విడిపించి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందన్నారు. రూ.10 కోట్లతో బైరామల్‌గూడ చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులు చేపడుతున్నామని, దానిలో భాగంగా ప్రస్తుతం రూ.2.60 కోట్ల వ్యయంతో పనులు జరుగుతున్నాయని అన్నారు. ఎగువ ప్రాంతాల నుండి వచ్చే వరదనీరు నేరుగా సరూర్‌నగర్ చెరువులోకి వెళ్లేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. దీని వల్ల పరిసర కాలనీవాసులకు వరద ముంపు సమస్య తీరుతుందన్నారు. అనంతరం బైరామల్‌గూడలోని ప్రాథమిక పాఠశాలను మధుయాష్కీ పరిశీలించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిసి శ్రీనివాస్, ఇఇ కార్తీక్, కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం మాజీ ఛైర్మన్‌లు నల్ల రఘుమారెడ్డి, సత్యనారాయణ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, వజీర్ ప్రకాష్‌గౌడ్, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీపాల్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, నర్సింహాయాదవ్, వేణుగోపాల్ యాదవ్, నాయకులు కందికంటి శ్రీధర్‌గౌడ్, ఎనుముల రవీందర్‌రెడ్డి, కోటగిరి శ్రీనివాస్‌గౌడ్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, దేరంగుల కృష్ణ, బద్రినాథ్, అనసూయ, సరిత, గోపాల్ ముదిరాజ్, సూర్యప్రకాష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## బాలాపూర్‌లో బొడ్రాయి ప్రతిష్టాపనోత్సవాలకు సర్వం సిద్ధం

### -నేటి నుండి మూడు రోజుల పాటు ఉత్సవాలు
### -విజయవంతం చేయాలని ఉత్సవ కమిటీ పిలుపు



బాలాపూర్‌లో బొడ్రాయి ప్రతిష్టాపనకు సిద్ధం చేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న బొడ్రాయి కమిటీ సభ్యులు

**సరూర్‌నగర్, జూన్ 24 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం జిహెచ్‌ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని బాలాపూర్ గ్రామంలో గురువారం నుండి ప్రారంభం కానున్న శ్రీశ్రీశ్రీ శీతలా బొడ్రాయి (నాభిశిలా) ప్రతిష్టాపనా మహోత్సవానికి సర్వం సిద్ధం చేసినట్లు గ్రామ బొడ్రాయి కమిటీ నాయకులు తెలిపారు. కొన్ని దశాబ్దాల క్రితం ఆనాటి పూర్వికులు ప్రతిష్టించిన బొడ్రాయి స్థానంలో కొత్తగా బొడ్రాయిని గ్రామ ప్రజల సహకారంతో ప్రతిష్టించనున్నట్లు వారు తెలిపారు. ప్రతి యేడాది బాలాపూర్ గణేష్ నవరాత్రి ఉత్సవాలు, లడ్డూ వేలం జరిగే గ్రామ కూడలిలో ఉన్న బొడ్రాయి వద్ద నూతనంగా నాభిశిల ప్రతిష్టాపనకు సిద్ధం చేసి ఉన్న దిమ్మెను అదే విధంగా ఏర్పాట్లను బొడ్రాయి కమిటీ సభ్యులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిష్టా పురోహితులైన చండీ ఉపాసకుడు, కోటి దీపోత్సవ పురోహితుడు బ్రహ్మశ్రీ రేవల్లి రాజు శర్మ, పురోహితుడు బ్రహ్మశ్రీ సభాపతి నరహరి శర్మ, బైండ్ల పూజారులు ఇంద్రపల్లి ముత్యాలు, శక్తిశ్రీ ఏదుల్ల గౌరీ శంకర్‌ల ఆధ్వర్యంలో గురువారం నుండి శనివారం వరకు బొడ్రాయి ప్రతిష్టాపనోత్సవ క్రతువులు జరుగుతాయని వివరించారు. ఇందులో భాగంగా ముఖ్య ఘట్టాలు 25న గురువారం సాయంత్రం నూతన బొడ్రాయి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు, 26న శుక్రవారం ఉదయం అగ్ని ప్రతిష్ట, యజ్ఞ ప్రారంభం, గణపతి హోమం, జలాధివాసం అనంతరం హోమాలు, రాత్రి శయ్యాధివాసం ఉంటాయని వెల్లడించారు. ఉత్సవాల్లో కీలక ఘట్టమైన 27వ తేదీ శనివారం ఉదయం గం. 7.38 నిమిషాలకు మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా బొడ్రాయి యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్టలు ఉంటాయని తెలిపారు. అనంతరం బైండ్ల పూజారుల క్రతువులు జరుగుతాయని పేర్కొన్నారు. మరుసటి రోజు 28వ తేదీ ఆదివారం ఉదయం బొడ్రాయి బోనాల పండుగ సందర్భంగా బోనాల ఊరేగింపు ఉంటుందని వారు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బొడ్రాయి పండుగ ఉత్సవాల్లో గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కళ్లెం ఎల్లారెడ్డి, వంగేటి ప్రభాకర్‌రెడ్డి, చిగిరింత నర్సింహారెడ్డి, కొలన్ శంకర్‌రెడ్డి, యెల్మేటి అమరేందర్‌రెడ్డి, గుండ్ల కొమురయ్య, వంగేటి మధుసూదన్‌రెడ్డి, సంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎర్ర జైహింద్, మేకల సంజీవ, బాల్‌నింగని జంగయ్య, గిర్కట్టి కృష్ణంరాజుగౌడ్, అరవింద్‌గౌడ్, నీరుడు శ్రీరాములు, గుండె నాగార్జున బాబు, గురవని శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి : ఆగం రెడ్డి



బీరప్పగడ్డలో సర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ ఇంచార్జీ ఆకిటి ఆగం రెడ్డి తదితరులు

**ఉప్పల్, జూన్ 24 ప్రభాతవార్త :**
సర్ ప్రక్రియ ప్రజలకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని బీరప్ప గడ్డ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఆకిటి ఆగం రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం బీరప్పగడ్డ డివిషన్ లో సర్ పై బూత్ లెవెల్ కమిటీ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగం రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియపై ప్రతి కాంగ్రెస్ కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా బిఎల్ ఓలు ఈ ప్రక్రియని దృష్టి సారించాలని సూచించారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు తొలగించేలా ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. ఓటరు జాబితాల సవరణ ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకమన్నారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధ హక్కు అని, అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి బయట పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని, అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకునేలా చెర్యలు తీసుకో వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీరప్పగడ్డ డివిజన్ బూత్ కమిటీసభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## వర్షాకాలం నేపథ్యంలో అధికారులతో సమావేశం



సిబ్బందికి సూచనలు చేస్తున్న మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, జూన్ 24 ప్రభాతవార్త:** రాబోయే వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకుని లింగోజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి బుధవారం హైడ్రా, మాన్సూన్ ఎమర్జన్సీ టీం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ వరద నీరు సాఫీగా వెళ్లేలా క్యాచ్ పిట్లు శుభ్రం చేయాలని, డీ సిల్టింగ్ పనులు వేగవంతం చేయాలని సూచించారు. భారీ వర్షాల సమయంలో అత్యవసర పరిస్థితులు ఎదుర్కొనేందుకు యంత్రాలు సిద్దంగా ఉంచాలని, సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హైడ్రా, మాన్సూన్ ఎమర్జన్సీ టీం సిబ్బంది పాల్గొన్నారు.

## మాదన్నపేట మార్కెట్‌లోని సమస్యలు పరిష్కరిస్తాం



మార్కెట్‌లో పర్యటిస్తున్న ఛైర్మన్ చెకోలేకర్ లక్ష్మి, వైస్ ఛైర్మన్ కోట్ల శ్రీనివాస్‌లు

**సైదాబాద్, జూన్ 24 ప్రభాతవార్త:** మాదన్నపేట కూరగాయల మార్కెట్‌ను హైద్రాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటి ఛైర్మన్ చెకోలేకర్ లక్ష్మి, వైస్ ఛైర్మన్ కోట్ల శ్రీనివాస్‌లు అధికారులతో కలసి పరిశీలించారు. రాబోయే వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పరిశీలించారు. కూలిపోయే దశలో ఉన్న షెడ్ల స్థానంలో నూతనషెడ్ల నిర్మాణం చేపట్టాలని, మార్కెట్‌లో అంతర్గత రోడ్లు శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మార్కెట్‌లోని చెత్తను తరలించేలా చర్యలు చేపట్టాలని రాంకి అధికారులను ఫోన్ ద్వారా కోరారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్, డైరెక్టర్లు పన్నాల రాజేందర్‌రెడ్డి, మస్రత్ సుల్తానా, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరి అపర్ణ, మాదన్నపేట ఆఫ్ ఇంఛార్జి సంధ్య పాల్గొన్నారు.

## మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: పారిజాత



ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్న చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, జూన్ 24 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. మహేశ్వరం నియోజకవర్గంలోని జిహెచ్‌ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ కిందకు వచ్చే బాలాపూర్ డివిజన్‌లో బుధవారం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పారిజాత పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యతనిస్తున్నదని గుర్తు చేశారు. రాష్ట్రంలో ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరను అందజేయాలని ప్రభుత్వం సంకల్పించిందని పారిజాత అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు బాల్‌నింగని జంగయ్య, గిర్కట్టి కృష్ణంరాజుగౌడ్, టేకుల శశిధర్‌రెడ్డిలతో పాటు పగడాల ఉమేష్, అరవింద్‌గౌడ్, తూళ్ళ సునీతగౌడ్, పాల్గొన్నారు.

### ద్విచక్ర వాహనం ఢీ ..గుర్తు తెలియని వ్యక్తి మృతి

**మలక్ పేట, జూన్ 24, ప్రభాతవార్త:**
ద్విచక్ర వాహనం ఢీకొనడంతో గుర్తుతెలియని వ్యక్తి తీవ్ర గాయాలకు గురై మరణించిన సంఘటన మలక్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం గుర్తు తెలియని వ్యక్తి (55) భాగ్యలక్ష్మి డాబా పిల్లర్ నెంబర్ 1464 వద్ద రోడ్డు దాటుతుండగా ముసారంబాగ్ నుంచి చాదర్ ఘాట్ వైపు వేగంగా వెళుతున్న ద్విచక్ర వాహనదారుడు ఢీకొనడంతో తీవ్ర గాయాలకు గురయ్యాడు. దీంతో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యంలోని మరణించినట్లు ఆసుపత్రి వైద్యులు ధ్రువీకరించారు. మృతుడు తెల్లరంగు చొక్కా, కాకి ప్యాంటు ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసుకునే దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రతి ఆడబిడ్డ ముఖంలో చిరునవ్వే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం : నెమలి అనిల్



మహిళలకు చీరెలను పంపిణీ చేస్తున్న నెమలి అనిల్

**నాచారం, జూన్ 24 ప్రభాతవార్త :** మహిళల సంక్షేమం, ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం మల్లాపూర్ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నెమలి అనిల్ కుమార్ పాల్గొని అర్హులైన మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రతి ఆడబిడ్డ ముఖంలో చిరునవ్వు కనిపించడమే కాంగ్రెస్ ప్రభుత్వ విజయానికి నిజమైన నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శులు దంతూరి రాజు గౌడ్, చౌదరిపల్లి పర్వతాలు, కోయగూర బాలరాజ్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పీ.జీ. సుదర్శన్, మక్తల బాలరాజ్ గౌడ్, మెరుపుల బాలరాజ్ గౌడ్, కప్పర సాయి, బెల్లం శ్రీను, కోయలకొండ రాజేష్, ఎస్వీ కిట్టు, సురేష్ గౌడ్, టిల్లు ముదిరాజ్, మనోహర్, ఫిరోజ్, నిక్కీ గౌడ్, శైలజ, సోని, నిర్మల రెడ్డి, లావణ్య, ఇష్రత్ బాను, సునీత పాల్గొన్నారు.

## మహిళలకు వరంగా ఇందిరమ్మ చీరలు : రజిత రెడ్డి



ఉప్పల్ శాంతినగర్ లో మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ మందముల రజిత రెడ్డి తదితరులు

**ఉప్పల్, జూన్ 24 ప్రభాతవార్త :**
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి, సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ డివిజన్ పరిధిలోని శాంతి నగర్ లో చేపట్టిన ఇందిరమ్మ చీరల పంపిణీకి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... గతంలో నాసిరకం చీరలు ఇచ్చి మహిళల గౌరవాన్ని తగ్గించారని, కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత నాణ్యమైన, చేనేత కార్మికులు రూపొందించిన చేనేత వస్త్రాలను ఇందిరమ్మ సారెగా అందిస్తూ మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తోందని కొనియాడారు. సోనియా గాంధీ ఆశయాల స్ఫూర్తితో మహిళల ఆర్థిక, సామాజిక అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక విప్లవాత్మక పథకాలను అమలు చేస్తోందని గుర్తుచేశారు. ప్రతి ఆడబిడ్డకు ఈ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా తాము నిరంతరం శ్రమిస్తామని భరోసా ఇచ్చారు. మహిళల ఆర్థిక సాధికారతే ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. అర్హులైన మహిళలంతా ఇందిరమ్మ చీరలు తీసుకోవాలని కోరారు. మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా కోటీశ్వరు లు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బాకారం లక్ష్మణ్ , లింగంపల్లి రామకృష్ణ, తుమ్మల దేవిరెడ్డి, అలుగుల అనీల్ కుమార్, కాటేపల్లి విజయ్ కుమార్ కుశంగళ సతీష్, సత్యనారాయణ చారీ, తైసీన్, బచ్చ రాము, బొడగే మల్లేష్, నామొజు నరేష్, వెంకటేష్, గట్టు ఇందిరా , తుఫ్రాన్ అనిత , జనగామ విజయ , జి. రేణుక పాల్గొన్నారు

## మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత



చీరలు పంపిణీ చేస్తున్న మధురఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జూన్ 24 ప్రభాతవార్త:**
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వం కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా నాయకురాలు చిలుక మధురఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్‌లోని శ్రీకృష్ణనగర్‌లోని వార్డు కార్యాలయంలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఆడబిడ్డకు గౌరవప్రదమైన జీవనం అందించడమే లక్ష్యంగా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్నీ ప్రభుత్వం చేపట్టిందన్నారు. దేశంలో మరెక్కడా లేనివిధంగా మహిళలకు సంక్షేమ పథకాలను తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికె దక్కుతుందన్నారు. అర్హులైన ప్రతి మహిళకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. మహిళలను కోటీశ్వరులు చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు రేణుక, రమాదేవి, కవిత, జయమ్మ, మాధవి, సంతోష, శ్వేత, లావణ్య, ప్రమీల, స్వరూప, రజిత తదితరులు పాల్గొన్నారు.

## అల్మాస్‌గూడలో ఇందిరమ్మ చీరెల పంపిణి



అల్మాస్‌గూడలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా చీరలను మహిళలకు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**సరూర్‌నగర్, జూన్ 24 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం జిహెచ్‌ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని నాదర్‌గుల్ డివిజన్-57 కిందకు వచ్చే అల్మాస్‌గూడలో కాంగ్రెస్ నాయకులు బుధవారం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఐసిసి విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డిలు పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇందిరమ్మ చీరలను మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో బోయపల్లి వెంకట్‌రెడ్డి, నవారు ప్రభాకర్‌రెడ్డి, దిండు శ్రీనివాస్‌గౌడ్, మల్గారి శ్రీధర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మల్లేష్, శ్రీను, రామిడి దిలీప్‌రెడ్డి, కేతావత్ లలిత తదితరులు పాల్గొన్నారు.